PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 115 | విజయవాడ, బుధవారం 27 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 27 November 2024 | Rs

అదానీ, జగన్‌లపై కేసు ఎందుకు పెట్టరు?

- వారిని మోడీ, చంద్రబాబు రక్షిస్తున్నారు
- చంద్రబాబు, జగన్ విధానాలు ఒక్కటే : బివి రాఘవులు

2



వ్యవస్థలు సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల జీవితాలు మెరుగుపడేది

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధ
- ఘనంగా రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలు

7

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై
భారీ నిరసన ర్యాలీ
రాష్ట్రపతి, ప్రధాని, సిఎంలకు హెచ్చరిక నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక, కర్షక లోకం కదంతొక్కింది. రైతు, కార్మికులు, శ్రామికులు, మహిళల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రం నుంచి పిడబ్ల్యూడి గ్రౌండ్స్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు నిర్వహించిన ఈ ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు తదితర వర్గాలకు చెందిన వారు ఎర్రజెండాలు చేతబూని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తోందని చెప్పారు. రైతులకు పంట రుణాలు మాఫీ చేయాలని కోరితే స్పందించని ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం ఇప్పటి వరకూ 17 లక్షల కోట్ల బ్యాంక్ రుణాలను మాఫీ చేసిందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పోరాటాలు చేస్తూ కార్మిక సంఘాలు సాధించిన కార్మిక చట్టాలను పక్కన పెట్టి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఇదే చెప్పిందా అంటూ ప్రధానిని ప్రశ్నించారు. ముడుపులు అందుకుని అదానీకి అనుకూలంగా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలపై ఇప్పుడు అమెరికాలో కేసులు నడుస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలను కాపాడాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ అంటూ పెట్టుబడిదారులకు అనుకూల విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తోందన్నారు. మహిళలపై అత్యాచారాలు భారీగా పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. ఎపి రైతు సంఘాల మిగతా 7లో



విజయవాడలో కార్మిక, కర్షకుల భారీ ప్రదర్శన

కార్మిక, కర్షకలోకం కన్నెర్ర

- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

8

శ్రమజీవుల పోరుబాట

- దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు, ర్యాలీలు


7

డిసెంబర్ 20న రాజ్యసభ ఉప ఎన్నిక

- రాష్ట్రంలో మూడు స్థానాలు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో ఆరు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూలు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు స్థానాలు, ఒడిషా, పశ్చిమ బెంగాల్, హర్యానా ఒక్కోస్థానం చొప్పున మొత్తం ఆరు రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని మూడు స్థానాలు కూడా టిడిపి కూటమి ఖాతాలోని పడనున్నాయి. వైసిపి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. షెడ్యూలు ప్రకారం.. రాజ్యసభ ఉప ఎన్నికలకు డిసెంబరు 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు తుది గడువు డిసెంబరు 10 వరకు ఉంది. డిసెంబరు 11న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబరు 13 తుది గడువు అని షెడ్యూల్‌లో ఇసి పేర్కొంది. డిసెంబరు 20న పోలింగ్ జరగనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరగనుండగా, అదే రోజున ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మోపిదేవి వెంటరమణ పదవీ కాలం 2026 జూన్ 21 వరకు ఉంది. బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య పదవీ కాలం 2028 జూన్ 21 వరకు ఉంది. దాదాపు ఏడాన్నర పాటు పదవీకాలం ఉంటుండగానే వెంకటరమణ రాజీనామా చేశారు. దాదాపు మూడున్నరేళ్ల పాటు పదవీకాలం ఉంటుండగానే బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.



అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనం

- స్టార్టప్‌లకు రూ.25లక్షల వరకు సీడ్ ఫండింగ్
- 2029 కల్లా 5లక్షల వర్క్ స్టేషన్లు
- ఐటి పాలసీపై సిఎం చంద్రబాబు సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. యువత భవిష్యత్తు అంతా డీప్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వంటి నూతన టెక్నాలజీల పైన ఆధారపడి ఉంటుందన్నారు. సచివాలయంలో మంగళవారం ఐటి పాలసీపై అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటి సంస్థలు, ఐటి డెవలపర్స్‌కు ఇవ్వాల్సిన ప్రోత్సాహం పైన కూడా ఆయన చర్చించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ 2029 కల్లా రాష్ట్రంలో 5లక్షల వర్క్ స్టేషన్లు, 2034 కల్లా 10లక్షల వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కో వర్కింగ్ స్పేస్‌లు, కార్యాలయ సముదాయాల నిర్మాణానికి అవసరమైన భూములు సబ్సిడీపై లీజుకివ్వడం, సింగిల్ విండో విధానంలో మౌలిక వసతుల కల్పనకు అనుమతులివ్వడం, ఐటి సంస్థలకు ఇండస్ట్రియల్ పవర్ టారిఫ్ కింద తీసుకురావడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. స్టార్టప్ పాలసీలో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళలకు రూ.25 లక్షల వరకు సీడ్ ఫండింగ్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఐఐటిలతో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్)కు అనుసంధానంగా ఐదు జోనల్ ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుపై సిఎం అధికారులకు సూచనలు చేశారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ, దక్షిణాంధ్ర, గోదావరి, ఉత్తరాంధ్ర ఐదు ప్రాంతాల్లో జోనల్ హబ్‌లకు కేంద్రంగా "అమరావతి రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్" పనిచేయాలన్నారు. వీటికి దేశంలోని ఐఐటిలను అనుసంధానం చేయాలన్నారు. నెలలో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. పాలసీ ప్రకటన అనంతరం జిల్లా కలెక్టర్లు కూడా వర్క్‌స్టేషన్లు ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులలో ఎంతమంది వర్క్‌ఫ్రమ్ హోమ్ కింద పనిచేస్తున్నారో వివరాలు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ , అధికారులు పాల్గొన్నారు.

డెవలపర్లకు కేటగిరీల వారీగా రాయితీలు:

ఐటి సంస్థల కోసం మౌలిక వసతులు కల్పించే డెవలపర్లకు ఇచ్చే రాయితీలను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది, కో వర్కింగ్ స్పేస్‌లు, నైబర్‌హుడ్ వర్కింగ్ స్పేస్‌లు, ఐటి క్యాంపస్‌లకు వాటి సీట్ల సామర్ధ్యం, కార్యాలయ సముదాయం విస్తీర్ణానికి అనుగుణంగా సబ్సిడీలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. కో వర్కింగ్ స్పేస్‌కు సబ్సిడీ పొందాలంటే వంద సీట్ల సామర్ధ్యం కానీ, 10వేల చదరపు అడుగుల కార్యాలయ సముదాయం కానీ ఉండాలి. నైబర్‌హుడ్ వర్కింగ్ స్పేస్‌కు పది సీట్ల సామర్ధ్యం కలిగిన వెయ్యి చదరపు అడుగులు ఆఫీస్ స్పేస్ తప్పనిసరి. ఐటి క్యాంపస్‌కు 10లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి. రూ.30కోట్ల టర్నోవర్, 100మందికి ఉద్యోగాలు కల్పించే ఐటి సంస్థలకు ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

సోలార్ ఎనర్జీ తప్పనిసరి వినియోగ ఒప్పందం

ప్రజల సొమ్మును ప్రైవేటుకు దోచిపెట్టేందుకే
ఎపిఇఆర్‌సికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోలార్ ఎనర్జీని తప్పనిసరిగా వినియోగించుకోవాలనే కేటగిరీ కింద ఒప్పందం చేసుకోవడం ప్రజల సొమ్మును అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టేందుకేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2023-2024 ఆర్థిక సంవత్సర ఛార్జీలకు సంబంధించి విద్యుత్ పంపిణీ సంస్థలు దాఖలు చేసిన పిటీషన్లు ఓపి నెం 69/2024, 70/2024, 71/2024కు సమాధానంగా దాఖలు చేస్తున్న అభ్యంతరానికి కొనసాగింపుగా మంగళవారం మరో లేఖ పంపించారు.

రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు కచ్చితంగా వినియోగించాలనే కేటగిరీ కింద సెకీతో ఒప్పందాలు చేసుకున్నాయని, ఇది సరికాదని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి థర్మల్ ప్లాంట్లను నెలకొల్పింది వాటి పూర్తి సామర్ధ్యాన్ని వినియోగించుకోవడానికే అన్నది స్పష్టమని, వాటి పూర్తి సామర్ధ్యాన్ని వినియోగించుకోకుండా, ప్రైవేటు కంపెనీల సోలార్ తప్పనిసరిగా వినియోగించుకోవలసిన కేటగిరీ కింద ఒప్పందం చేసుకోవడం ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీయడానికేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సొమ్మును ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయడానికేనని భావిస్తున్నట్లు తెలిపారు. అందుకే ఈ ఒప్పందాల ద్వారా ఏర్పడే ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రజలకు భారంగా మారే విధంగా సెకీతో ఒప్పందాలు చేసుకోవడం వెనుక అవినీతి ఉందని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, తూర్పు న్యూయార్కు జిల్లాలో ఉన్న జిల్లా కోర్టులో 24 అక్టోబర్, 2024వ తేదీన కేసు నమోదైందని, ఈ కేసు పిటీషన్‌లో 46,47,48,49 పేరాల ప్రకారం సెకీ ఒప్పందాలు పూర్తిగా అవినీతితో కూడుకున్నవని స్పష్టం చేశారని తెలిపారు. ఆదానీ ఆధ్వర్యంలో 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను దీర్ఘకాలం పాటు కొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించడానికి ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలకు రూ.1,750 కోట్ల లంచం ఇచ్చారని పిటీషన్‌లో ఉందని, ఇలా అవినీతికి పాల్పడి 7,000 మెగావాట్ల మిగతా 2లో

మహారాష్ట్ర ఆపద్ధర్మ సిఎంగా షిండే


ముంబయి : మహారాష్ట్రలో రాజకీయ హైడ్రామా కొనసాగుతోంది. సిఎం ఏక్‌నాథ్ షిండే మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను కలిసి తన రాజీనామా లేఖను అందజేశారు. నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసే వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆయన షిండేను కోరారు. ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్ షిండే వెంట రాజ్‌భవన్‌కు వెళ్లారు. మహాయుతి కూటమిగా కలిసే పోటీ చేశామని, ఇప్పటికీ కలిసే ఉన్నామని షిండే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు బిజెపి కేంద్ర నాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, ఆయననే సిఎంను చేయాలని బిజెపి ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. ఫడ్నవీస్‌కు సిఎం పదవి ఇచ్చే విషయంపై తమ పార్టీతో ఎవరూ సంప్రదింపులు జరపలేదని, ఇప్పటివరకూ తాము ఎవరి పేరుకూ అంగీకారం తెలుపలేదని శివసేన నాయకులు చెప్పారు. తనకు మద్దతుగా ఎవరూ ముంబయికి రావద్దని షిండే తన పార్టీ కార్యకర్తలను కోరారు. బిజెపి నాయకత్వం కేంద్ర పరిశీలకుడిని నియమించి, ముంబయికి పంపిన తర్వాతే ముఖ్యమంత్రి పదవిపై పీఠముడి వీడుతుందని భావిస్తున్నారు.

సెకి విద్యుత్ అదానీదే

పిపిఎపై డిస్కామ్ అధికారుల సంతకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి) రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు కట్టబెట్టనున్న విద్యుత్‌ను అదానీ కంపెనీనే అందించనుంది. దీంతోపాటు అజూర్ పవర్ కంపెనీ కూడా భాగస్వామ్యంగా ఉంది. వ్యవసాయ విద్యుత్ పేరుతో సెకితో 25ఏళ్ల పాటు ఏడు వేల మెగావాట్లను సెకి నుంచి తీసుకునేందుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పందంలో అదానీకి సంబంధం లేదని ఇప్పటివరకు గత ప్రభుత్వ పెద్దలు బుకాయిస్తున్నారు. 2021 సెప్టెంబర్ 12 అదానీ మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రహస్యంగా తాడేపల్లిలో కలవడం, వ్యవసాయానికి కావాల్సిన ఏడు వేల మెగవాట్ల విద్యుత్ తాము అందిస్తామని 15వ తేదిన సెకి లేఖ రాయడం తెలిసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదనను గంటల్లోనే ఆగమేఘాల మీద ఆమోదించుకున్న అప్పటి ప్రభుత్వం డిసెంబర్ 1వ తేదీన విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) చేసుకుంది. 7వేల మెగావాట్లు (మెవా)కు సంబంధించిన ఈ ఒప్పందంలో సోలార్ పవర్ డెవలపర్(ఎస్‌పిడి)గా అదానీ గ్రీన్ ఎనర్జీ ఫోర్ లిమిటెడ్, అజూర్ పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎపిఐపిఎల్) కంపెనీలే ఉన్నాయి. ఇందులో అదానీ గ్రీన్ నుంచి 4667 మెవా, అజూర్ నుంచి 2333 మెవా చొప్పున విద్యుత్ సరఫరా జరుగుతుందని ఉన్న మిగతా 2లో



BUYER-BUYING ENTITY PSA

SCHEDULE 1: LIST OF LOAs ISSUED TO SPDs

Sl. No.	SPD Name	Project Capacity (MW)	Buying Entity Share (MW) as per PSA	Applicable Tariff as per SECI-SPD PPA (Rs/kWh)	Applicable Tariff as per SECI-Buying Entity PSA including trading margin (Rs/kWh)
1.	Adani Green Energy Four Limited	6000	4667	2.42	2.49
2.	Azure Power India Private Limited	3000	2333	2.42	2.49
	Total	9000	7000		

2 SCHEDULE 2: BUYER-SPD PPA

[Shall be provided to Buying Entity within 30Days of signing of PPA with SPD]

3 SCHEDUE 3: AMOUNT REALISATION FOR SALE OF SOLAR POWER

(i) The billing to Buying Entity shall be done by Buyer for realisation of amount for Solar Power.
(ii) The payments to be made by Buying Entity to Buyer for the Solar Power in a Monthly Invoice shall comprise of amounts to be realized for Solar Power.
(iii) The Bills shall be raised by Buyer on Buying Entity as mentioned in clause 6.2

సెకి ఒప్పందంపై విచారణ : ఎసిబికి చక్రవర్తి ఫిర్యాదు

సెకి - విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య జరిగిన పిపిఎపై విచారణ జరిపించాలని సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షులు నల్లమోతు చక్రవర్తి ఎసిబికి ఫిర్యాదు చేశారు. ఎసిబి కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ సుచరితను మంగళవారం కలిసి విచారణ చేయాలని కోరారు. ఈ ఒప్పందం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గౌతమ్ అదానీ రూ.1750 కోట్లు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారని అమెరికాలో కేసు నమోదైందని తెలిపారు. ఈ ఫిర్యాదులో జగన్‌మోహన్ రెడ్డి, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఎపి ఇంధన శాఖ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ కార్యదర్శి ఎన్ శ్రీకాంత్‌ల పేర్లను పేర్కొన్నారు. సెకి ఒప్పందంపై రాష్ట్రప్రభుత్వం నోరుమెదపడం లేదని చక్రవర్తి అనంతరం మీడియాతో చెప్పారు. సెకి ఒప్పందం చట్టం విరుద్ధమని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపక్షంలో ఉండగా విమర్శించడంతోపాటు 1300 పేజీలతో కోర్టులో కేసు కూడా వేశారని తెలిపారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను కెన్యా ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో కూడా అదానీ ప్రాజెక్టులను నిలిపివేశారని, దేశంలో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని అసహనం వ్యక్తం చేశారు.

గ్రామీణాభివృద్ధి పథకాలకు రుణ వెసులుబాటు పొడిగించండి

- నిర్మలా సీతారామన్‌కు పవన్ కల్యాణ్ వినతి
- ఢిల్లీ పర్యటనలో మంత్రులతో వరుస భేటీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి పథకాలకు రుణ వెసులుబాటును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పాటు పలువురు కేంద్ర మంత్రులతో ఆయన సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల పథకం (ఎపిఆర్‌ఆర్‌పి) కోసం నిర్దేశించిన గడువు ఈ ఏడాది డిసెంబరు 31తో ముగియనుందని, అయితే పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవని గడువు పొడిగించాలని ఆర్థిక మంత్రిని పవన్ కోరారు. ఇందుకోసం ఆసియా మౌలిక సదుపాయాల అభివృద్ధి పెట్టుబడుల బ్యాంకు (ఎఐఐబి) నుంచి తీసుకొన్న రుణ పథకాన్ని 2026 డిసెంబర్ 31 వరకు పొడిగించాలని విన్నవించారు. రుణ చెల్లింపు విషయంలో ఒప్పందంలో పేర్కొన్న రీయింబర్స్‌మెంటు పద్ధతి కాకుండా కేంద్రమే ముందు చెల్లించే విధంగా చూడాలని కోరారు. ప్రస్తుతం ఉన్న 70 శాతం (ఎఐఐబి) : 30 శాతం పన్నులు (ఏపి ప్రభుత్వం) విధానం నుంచి 90 శాతం (ఎఐఐబి) : 10 శాతం (ఏపి ప్రభుత్వం)గా మార్పు చేయాలని కోరారు. 455 మిలియన్ యుఎస్ డాలర్ల (రూ. 3834.52 కోట్లు) బ్యాంక్ అంగీకారం మేరకు వాటాను కొనసాగిస్తూ నిధుల విడుదల మార్పును పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. ఆర్థిక మంత్రితో పాటు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్, కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, కేంద్ర పర్యటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తోనూ ఆయన భేటీ అయ్యారు. ఆయా శాఖల అభివృద్ధి పథకాలను వివరించి, వాటి కోసం సహకారం కోరారు.



సామర్లకోట - ఉప్పాడ రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జి

పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో సామర్లకోట - ఉప్పాడ రహదారిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఒబి) నిర్మాణం అవసరం ఉందని, దీన్ని సత్వరమే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని పవన్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా శ్రీపాద వల్లభ స్వామి ఆలయానికి వచ్చే యాత్రికుల కోసం నాలుగు ముఖ్యమైన రైళ్ళకు పిఠాపురం రైల్వే స్టేషన్‌లో హాల్ట్ మంజూరు చేయాలన్నారు. నాందేడ్ - సంబల్పూర్ నాగావళి ఎక్స్ ప్రెస్, నాందేడ్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, విశాఖ పట్నం- సాయి నగర్ షిర్డీ ఎక్స్ ప్రెస్, ఏపీ ఎక్స్ ప్రెస్ (విశాఖపట్నం - న్యూఢిల్లీ)కి మిగతా 2లో

ఇవిఎంలపై పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నిర్వహించే ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎం)లకు బదులుగా పేపర్ బ్యాలెట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిబి వరాలేతో కూడిన ధర్మాసనం విచారించింది. చంద్రబాబు, జగన్ వంటి నేతలు కూడా ఇవిఎంల ట్యాంపరింగ్‌ను ప్రశ్నించారని వాదనల సందర్భంగా కెఎ పాల్ పేర్కొన్నారు. అమెరికా వంటి దేశాలు బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయని, అదే పద్ధతిని ఇక్కడ కూడా పునరుద్ధరించాలని కోరారు. ఇవిఎంలు ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు, జగన్ సహా పలు రాజకీయ పార్టీలు, నేతలు కూడా తన వైఖరికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. 'చంద్రబాబు, జగన్ వంటి వాళ్లు ఓడిపోయినప్పుడు ఇవిఎంలు ట్యాంపరింగ్ అంటారు. గెలిస్తే వాటి ప్రస్తావన చేయరు. దీనిని ఎలా చూడాలి? ఈ పిటిషన్ కొట్టివేస్తున్నాం. ఇలాంటివి వాదించే ప్రదేశం ఇది కాదు' అని పేర్కొన్నారు.



ఇస్లామాబాద్ డి-చౌక్ వద్ద గుమిగూడిన ఇమ్రాన్‌ఖాన్ మద్దతుదారులు

యుద్ధక్షేత్రంగా ఇస్లామాబాద్

- ఇమ్రాన్‌ఖాన్ మద్దతుదారుల మహాప్రదర్శన
- నిరసనలతో అట్టుడికిన పాక్ రాజధాని
- భద్రత బలగాల కాల్పులు.. ఆరుగురు మృతి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ రాజధాని నగరం ఇస్లామాబాద్ రణరంగాన్ని తలపించింది. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన మద్దతుదారులు భారీ ర్యాలీ చేపట్టారు. లక్షలాది మంది రాజధాని రహదారులపై చేరుకోవడం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు హింసకు పాల్పడటంతో సైన్యం రంగంలోకి దిగింది. భద్రత బలగాలకు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఆరుగురు చనిపోయారు. మరణించిన వారిలో ఐదుగురు భద్రతా సిబ్బంది, మిగతా 7లో

సిఐడి రిటైర్డు అధికారి విజయపాల్ అరెస్టు

- రఘురామకృష్ణంరాజు కేసులో విచారణ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఐడి రిటైర్డు అధికారి విజయపాల్‌ను ఒంగోలు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అప్పటి ఎంపి, ప్రస్తుత డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజును కస్టోడియల్ టార్చర్ చేసినట్లు నమోదైన కేసులో మరోసారి విచారణ జరిగింది. ఈ కేసులో నిందితునిగా ఉన్న సిఐడి రిటైర్డు అధికారి విజయపాల్‌ను ఒంగోలులో ప్రత్యేక విచారణ అధికారి, జిల్లా ఎస్‌పి దామోదర్ విచారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారణ కొనసాగింది. అప్పట్లో ఎంపిగా ఉన్న రఘురామకృష్ణంరాజును గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో అరెస్టు చేసి మంగళగిరి తరలించారు. అప్పట్లో సిఐడి ఎఎస్‌పిగా విజయాపాల్ ఉన్నారు. ఆయనతో పాటు మాజీ సిఎం వైఎస్ జగన్, నాటి సిఐడి అదనపు డిజి సునీల్‌కుమార్, ఇంటిలిజెన్స్ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులు, గుంటూరు జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రభావతిపై రఘురామకృష్ణంరాజు ఇటీవలే గుంటూరు నగరపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను అక్రమంగా అరెస్టు చేసి కస్టడీలో హింసించారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పట్లో ఆయన కాళ్లు బాగా వాచిపోయిన దృశ్యాలు మీడియాలో వచ్చాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు విచారణకు ప్రకాశం జిల్లా ఎస్‌పి దామోదర్‌ను ప్రత్యేక విచారణ అధికారిగా నియమించింది. దీంతో తొలుత సిఐడి రిటైర్డు అధికారి గతంలోనే ఒకసారి విచారణ చేశారు. మలిదశలో ఆయనను పలు కోణాల్లో రహస్యంగా ఎస్‌పి విచారణ జరిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు విజయపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మీడియానూ ఎస్‌పి కార్యాలయంలోని అనుమతించలేదు. మిగతా వారిని కూడా ఎస్‌పి విచారించనున్నారు.

జత్వానీ కేసులో పోలీసుల ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

ప్రజాశక్తి- అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పలువురు పోలీస్ అధికారుల పిటిషన్లల్లో కౌంటర్లు దాఖలు చేసేందుకు సిఐడి మరోసారి గడువు కోరింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపిఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ, గతంలో ఎసిపిగా చేసిన హనుమంతరావు, అప్పటి దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేశారు. వీటిలో కౌంటర్ వేసేందుకు గడువు కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ కోరారు. దీంతో, విచారణను డిసెంబర్ 2కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ల నమోదైన కేసులో వారంతా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి- అమరావతి

హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, ఎజి దమ్మాలపాటి శ్రీనివాసులు హాజరయ్యారు. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ఆస్తులు, ప్రాణాలు కోల్పోయారన్నారు. పౌరుల హక్కులను రాజ్యాంగం కాపాడుతోందని తెలిపారు. సంఘం అధ్యక్షులు కలిగినీడి చిదంబరం, ఉపాధ్యక్షులు నగరూరు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నన్నపనేని శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. తొలుత రాజ్యాంగ పీఠికలు, ముసాయిదా కమిటీ ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులతో హైకోర్టు న్యాయవాదుల సంఘం, న్యాయవాద పరిషత్ ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసింది. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ యడవల్లి లక్ష్మణరావు రాజ్యాంగ పీఠికను చదివి ఇతర రిజిస్ట్రార్లు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రమాణం చేయించారు.

నేడు ఆర్‌జివి ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ

ప్రజాశక్తి- అమరావతి

సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టులో విచారణకు రానుంది. ఈ రిట్‌ను అత్యవసరంగా విచారణ జరపాలని వర్మ లాయర్ కోరారు. దీంతో, బుధవారం విచారించేందుకు జస్టిస్ విఆర్‌కె కపాసాగర్ అనుమతిచ్చారు. వ్యూహం సినిమా విడుదల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లను కించపర్చేలా సోషల్ మీడియాలో వర్మ పోస్టులు పెట్టారంటూ అనకాపల్లి జిల్లా రావికమతం, ప్రకాశం జిల్లా మద్దిపాడు, గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు వేర్వేరుగా చేసిన ఫిర్యాదుల ఆధారంగా నమోదైన కేసులో వర్మ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

హ్యామ్ రేడియో ఆపరేటర్ల గౌరవవేతనం పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోస్తా జిల్లాల్లో పనిచేస్తున్న హ్యామ్ రేడియో ఆపరేటర్ల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు మంగళవారం జిఒఎంఎస్ నెంబరు 18ని విడుదల చేసింది. ఇప్పటి వరకు నెలకు రూ.15 వేలు ఉండగా, ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో రూ.18,450లకి వారి గౌరవ వేతనం పెరిగింది. కోస్టల్ జిల్లాలైన విజయనగరం, విశాఖపట్టణం, కాకినాడ, ఏలూరు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని తొమ్మిది మంది ఆపరేటర్లకు ఈ గౌరవ వేతనం పెంపు వర్తించనుంది.

అదానీ, జగన్‌లపై కేసు ఎందుకు పెట్టరు?

- వారిని మోడీ, చంద్రబాబు రక్షిస్తున్నారు
- చంద్రబాబు, జగన్ విధానాలు ఒక్కటే : బివి రాఘవులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

విద్యుత్తు ఒప్పందాల్లో భారీ అవినీతికి పాల్పడిన అదానీపైనా, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపైనా ఎందుకు కేసు పెట్టలేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రశ్నించారు. వారిని మోడీ, చంద్రబాబు రక్షిస్తున్నారని అన్నారు. చంద్రబాబు, జగన్ విధానాలు ఒక్కటేనని వివరించారు. నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వచ్చారు తప్ప, రాష్ట్రంలో ఇంకేమీ మారలేదన్నారు. పాత విధానాలే అమలవుతున్నాయని, అదానీతో జగన్ చేసుకున్న ఒప్పందాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారని తెలిపారు. అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు రూ.1,757 కోట్లు ముడుపులు అందినట్లు అమెరికా న్యాయవిభాగం తేల్చిందన్నారు. అధిక ధరకు విద్యుత్ కొనుగోలు వల్ల రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల రూపాయల భారం పడిందని తెలిపారు. సెకితో ఒప్పందాన్ని సిపిఎం అప్పట్లోనే వ్యతిరేకించిందని, టిడిపి తన వైఖరిని చెప్పలేదని గుర్తు చేశారు. అదానీ నుంచి ముడుపులు తీసుకున్న జగన్‌ని చంద్రబాబు రక్షిస్తున్నారని, అదానీని ఏమీ అనడం లేదని అన్నారు. ఈ వ్యవహారంపై అధ్యయనం చేసి స్పందిస్తానని చెబుతున్నారని, ఇప్పటికే పత్రికలు, అమెరికా అధ్యయనం చేసి అవినీతిని బయటపెట్టాయని తెలిపారు. జగన్ అవినీతికి పాల్పడ్డారని, రాష్ట్రాన్ని ధ్వంసం చేశారని, కోట్ల రూపాయలు దోచుకున్నారని టిడిపి కూటమి నాయకులు చెబుతున్నారని, విద్యుత్ ఒప్పందంలో భారీ అవినీతి బయటపడినా ఈ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ ఒప్పందం అమలైతే రాష్ట్ర ప్రజలపై 25 సంవత్సరాలపాటు భారం పడుతుందన్నారు. సౌర విద్యుత్ ధర అప్పట్లో యూనిట్ రూ.1.99 పైసలు ఉండేదని, రూ.2.49 పైసలకు ఒప్పందం చేసుకున్నారని వివరించారు. అప్పటి కంటే ఇప్పుడు సౌర విద్యుత్ ధరలు తగ్గాయన్నారు. ఆ ఒప్పందాన్ని ఎందుకు కొనసాగించాలని ప్రశ్నించారు. ఇసుక, బియ్యం అవినీతిపరులపై పీడీ యాక్ట్ పెడతామని అసెంబ్లీలో చంద్రబాబు చెప్పారని, పెద్ద పెద్ద అవినీతిపరులను ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. ప్రధాని మోడీ చిన్నచిన్న వ్యక్తులపై ఇడి, సిబిఐ, వంటి సంస్థలను ప్రయోగించారని, అదానీ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ విషయంలో మోడీ, సిఎం చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ముగ్గురు మంచి దోస్తులన్నారు. పోలవరంపై చంద్రబాబుకు తాను లేఖ రాశానని, ప్రస్తుతం ఉన్న డయాఫ్రం వాల్ పాడైపోయిందని, కొత్త దానిని నిర్మించాలని కోరారని, పాత దానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కొత్తదాని కోసం మరో రూ.వెయ్యి కోట్లు ఖర్చు అవుతుందన్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అదే కాంట్రాక్టర్లను కొనసాగిస్తున్నారని, జగన్‌పై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉక్కు పరిశ్రమను మిట్టల్ ఏర్పాటు చేయనుందని రాష్ట్ర ప్రభుత్వం చెప్తోందని, విశాఖలో ప్రభుత్వరంలోగల స్టీల్ ప్లాంట్‌ను సరిగా నడిపించకుండా దీనికి సమీపంలో ప్రయివేట్ వారికి అనుమతి ఇవ్వడం సరికాదని తెలిపారు. వెనుకబడిన ప్రాంతమైన కడప, ప్రకాశం జిల్లాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.

మధ్యంతర ఉత్తర్వులు రద్దు చేయండి

- ఎన్‌టిఆర్ హెల్త్ వర్సిటీ

ప్రజాశక్తి- అమరావతి

అమలాపురంలోని కోనసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసర్చ్ ఫౌండేషన్ మెడికల్ కాలేజీ, కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద పెరిగిన 75 ఎంబిబిఎస్ సీట్ల భర్తీ చేయాలనే మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ హైకోర్టులో పిటిషన్ వేసింది. కౌన్సెలింగ్ నీట్‌లో అర్హత పొందిన అర్హులతో 75 సీట్లను భర్తీ చేయాలని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని రద్దు చేయాలన్న వర్సిటీ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్, స్టాండింగ్ కౌన్సిల్ టివి శ్రీదేవి మంగళవారం కోరారు. ఇందుకు అనుమతిచ్చిన జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణను బుధవారానికి వాయిదా వేసింది. కోనసీమ మెడికల్ కాలేజీకి 25 సీట్లు, కర్నూలు విశ్వభారతి మెడికల్ కాలేజీకి 50 సీట్లు పెంచుతూ ఎన్‌ఎంసి ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో, స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండ్ కింద 75 సీట్ల భర్తీకి ఎన్‌టిఆర్ హెల్త్ వర్సిటీ కేటాయింపులు అన్యాయమంటూ ఆ కాలేజీల్లో ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో సీట్లు పొందిన నలుగురు విద్యార్థినులు హైకోర్టులో సవాలు చేశారు. వర్సిటీ నిర్ణయం ప్రకారం భర్తీ చేస్తే తమ కంటే తక్కువ మార్కులు వచ్చిన వాళ్లతో సీట్ల భర్తీ జరుగుతుందని పిటిషనర్ల వాదన.

దేశంలో బిజెపి రాజ్యాంగం

- పిసిసి చీఫ్ షర్మిల విమర్శ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఇప్పుడు బిజెపి రాజ్యాంగం అమలవుతోందని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ప్రాథమిక హక్కులకు విలువ లేదన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ఎపిసిసి పిలుపుమేరకు మంగళవారం 'కానిస్టిట్యూషన్ మార్చ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగానికి ప్రమాదం రాకుండా కాంగ్రెస్ పోరాడుతుందని చెప్పారు. సెక్యులరిజం స్ఫూర్తిని బిజెపి దెబ్బతీస్తోందని, మతాల మధ్య మంటలు రేపుతుందని అన్నారు. మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో ప్రజల ఊచకోతలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ లను మనుషులుగా చూడటం లేదన్నారు. దేశంలోని అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కులగణన జరగాలని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలులో ముడుపులపై ఎటువంటి విచారణ లేకపోవడానికి బిజెపినే కారణమని చెప్పారు. అదానీని బిజెపినే కాపాడుతుందన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు రాజ్యాంగాన్ని గౌరవించడం లేదని, ఎమ్మెల్యేలు చట్ట సభకు వెళ్లాలని రాజ్యాంగం చెబుతున్నా వారు వెళ్లడం లేదని అన్నారు. సెకి నుంచి విద్యుత్ కొనుగోళ్లలో ముడుపుల విషయంలో అన్ని సాక్ష్యాలు ఉన్నాయని అమెరికా సంస్థ ఎఫ్‌బిఐ చెప్పినా, చంద్రబాబు దర్యాప్తు చేయించడం లేదన్నారు. వెంటనే విచారణ కమిటీని వేయాలని డిమాండ్ చేశారు.

ఖర్గేతో పిసిసి మాజీ చీఫ్ గిడుగు భేటీ

ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలోని ఆయన నివాసంలో ఎపిసిసి మాజీ అధ్యక్షులు, సిడబ్ల్యుసి సభ్యులు గిడుగు రుద్రరాజు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ పరిస్థితులను ఖర్గే అడిగి తెలుసుకున్నారు. ఖర్గే సూచనలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని గిడుగు తెలిపారు.

మిట్టల్ స్టీల్‌కు భూమెక్కడ?

- నక్కపల్లిలో ప్రభుత్వం చేతిలో సరిపడా లేని భూమి
- పూర్తి కాని పరిహారం, పునరావాసం
- సమస్యలు పరిష్కారం కాకుండానే హడావుడి

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

'ఆలూలేదు, చూలూలేదు కొడుకు పేరు సోమలింగం' అన్నట్లుంది అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటుపై ప్రభుత్వ ప్రచారం. మిట్టల్ ప్రతిపాదిత భూమి ప్రభుత్వం వద్ద సిద్ధంగా లేనప్పటికీ స్టీల్‌ప్లాంట్ కొద్ది రోజుల్లో వస్తుందన్నట్లు హడావుడి చేస్తోంది. నక్కపల్లి మండలంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించినట్లు చెబుతున్న 4,500 ఎకరాల్లో వేంపాడు, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట, చందనాడ, డిఎల్.పురంలోని 2,100 ఎకరాలను బల్క్ డ్రగ్ పార్కుకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. మిగిలిన 2,400 ఎకరాలకు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో వెయ్యి ఎకరాలకుపైగా వివాదంలో ఉంది. సేకరించిన భూమికి పరిహారం, తరలించాల్సిన గ్రామాలకు పునరావాసంపై స్పష్టమైన హామీ ఈనాటికీ ఇవ్వకపోవడంతో భూములు జోలికి ప్రభుత్వం వెళ్లలేని స్థితి ఉంది. భూములు కోల్పోయిన మత్స్యకారులు, రైతుల సమస్య ఎంతోకాలంగా నలుగుతున్నా పరిష్కారం చూపకుండా మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

మొదట దశలో రూ.70 వేల కోట్ల వ్యయంతో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో 21 వేల మందికి ఉపాధి లక్ష్యంతో రాజయ్యపేట దగ్గర ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడానికి మిట్టల్ స్టీల్ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం తలూపింది. ఇందుకు కావాల్సిన 2,200 ఎకరాల్లో వెయ్యి ఎకరాలకు మించి ప్రభుత్వం వద్ద ప్రస్తుతం సిద్ధంగా లేదని ఓ అధికారి తెలిపారు. రెండో దశలో వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 7.3 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల విస్తరణకు మరో 3,500 ఎకరాలకుపైగా ఉండాలి. తొలి, రెండో దశలోల్లో 5,500 ఎకరాలు అవసరం. ప్రభుత్వం చేతిలో తొలిదశకు కూడా సరిపడా భూమి లేదు. రెండో దశకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం కాకుండానే రూ.1.61 లక్షల కోట్ల పెట్టుబడులతో స్టీల్‌ప్లాంట్ రానుందని ప్రభుత్వం ఊదరగొడుతోంది. విశాఖ-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఎపిఐఐసి చేసిన భూ సేకరణలో తరలిస్తామని ప్రకటించిన బోయపాడు, బుచ్చిరాజుపేట కొత్తూరు, చందనాడలో క్రివానిపాలెం, తమ్మయ్యపేట, తుమ్మలపేట, పాటిమీద, మూలపర్ర, డిఎల్.పురం వాడపేట ప్రజల పునరావాస సమస్యను తేల్చలేదు. 18 సంవత్సరాలు నిండిన వారికి చెల్లించాల్సిన ప్యాకేజీపై కటాఫ్ తేదీని వెల్లడించలేదు. డి పట్టా, సాగు భూములకు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించలేదు. నిర్వాసితుల కోసం రెండుసార్లు ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఒక్క సమస్యా పరిష్కరించలేదు.



పరిహారం, పునరావాస సమస్య పరిష్కరించాలి

భూములు కోల్పోయిన రైతులు, ఉపాధి కోల్పోనున్న వృత్తిదారులు, కూలీలు, మత్స్యకారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ చెల్లించాలి. ఊర్లు తరలించే నిర్వాసితులకు పునరావాసం, పునర్నిర్మాణం ఎప్పటిలోగా కల్పిస్తారు? ఎక్కడ కల్పిస్తారు? అనేది స్పష్టం చేయాలి. 18 ఏళ్లు నిండిన వారికి చెల్లించే ప్యాకేజీకి ఏ ఏడాదిని కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుంటారో తేల్చకుండా, ఉపాధిపై గ్యారంటీ ఇవ్వకుండా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై ముందుకెళితే నిర్వాసితులు, బాధితుల పక్షాన పోరాడతాం.

- ఎం.అప్పలరాజు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

సోలార్ ఎనర్జీ తప్పనిసరి వినియోగ ఒప్పందం

మొదటిపేజి తరువాయి

సోలార్ విద్యుత్‌ను కొనడానికి ఎపి డిస్కంలు సెకితో 25 ఏళ్ల దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నాయని, అవినీతి వల్లే వాటిని కచ్చితమైన వినియోగ కేటగిరీగా ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఈ అవినీతితో కూడిన విద్యుత్‌ను కొనడంకోసం రాష్ట్ర ప్రభుత్వ రంగంలో థర్మల్ ప్లాంట్ల విద్యుత్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయనీయకుండా తగ్గించి వేశారని స్పష్టంగా తెలుస్తోందని పేర్కొన్నారు. అవినీతితో కూడిన ఈ సోలార్ ఎనర్జీ కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని, దీనిపై విచారణ జరిపించాలని, మిగిలిన పిపిఎలను కూడా సమీక్ష చేయాలని కోరారు. గతంలో కొన్న విద్యుత్‌కు ఇప్పుడు ఛార్జీలు విధించడం అంటే గత విద్యుత్ చార్జీల టారిఫ్‌ను ఇప్పుడు పెంచడమే అవుతుందని వివరించారు. అందుకే ఇది వాయిదా వేసిన ఛార్జీల టారిఫ్ పెంపుదలగా భావిస్తున్నామని వివరించారు. దేనికీ లేని విధంగా గతంలో వాడిన దానికి ఇప్పుడు రేట్లు పెంచి వసూలు చేయడం దారుణమని వివరించారు. అందువల్ల ఈ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. నివాస గృహాలకు, షాపులు, సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి అదాని సంస్థతో ఒప్పందాలు చేసుకున్నారని, ఇందులోనూ పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందనే ఆరోపణలు ఉన్నాయని వివరించారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులపై వేలాది కోట్ల రూపాయల భారం పడుతుందని, అదానీ ఇతర సంస్థలతో కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అదానీ సంస్థలతో గ్రీన్ ఎనర్జీ పేరుతో ఒప్పందాలు చేసుకుంటోందని, దానికి భూములూ కేటాయిస్తున్నారని తెలిపారు. వీటిని నిలుపుదల చేసి, ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు.

బహిరంగ విచారణ జరపాలని విజ్ఞప్తి

విద్యుత్ నియంత్రణ మండలి ఈ అంశంపై బహిరంగ విచారణ జరిపే తేదీని ప్రకటించలేదని, విద్యుత్ వినియోగదారులు అనేకమంది అనేక రకాలైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల రాతపూర్వకమై అభ్యంతరాలకే పరిమితం కాకుండా ఈ అంశంపై బహిరంగ విచారణ నిర్వహించాలని, దానికి తగిన తేదీని ప్రకటించాలని విద్యుత్ నియంత్రణ మండలికి విజ్ఞప్తి చేశారు.

సెకి విద్యుత్ అదానీదే

మొదటిపేజి తరువాయి

ఒప్పందానికి రాష్ట్రప్రభుత్వం, డిస్కంలు ఆమోదం తెలిపాయి. సెకి-ఎస్‌పిడి-పిపిఎ ప్రకారం రెండు కంపెనీకు చెందిన విద్యుత్‌ను యూనిట్ ధర రూ.2.42లుగా, ట్రేడింగ్ మార్జిన్ 0.07పైసలు, మొత్తం కలిపి రూ.2.49లుగా పేర్కొన్నాయి. ఈ ఒప్పందంపై అప్పటి డిస్కంల సిఎండిలు, ఇంధన శాఖ డిప్యూటీ సెక్రటరీ సంతకాలు చేశారు. ఎపి సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిసిపిడిసిఎల్) సిఎండి జె పద్మజనార్ధన్ రెడ్డి, ఎపి తూర్పు ప్రాంత పంపిణీ సంస్థ (ఎపిఈపిడిసిఎల్) సిఎండి కె సంతోషరావు, ఎపి దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) సిఎండి హరనాథరావు, ఇంధన శాఖ డిప్యూటీ సెక్రటరీ బివిఎపి కుమార్ రెడ్డి, సెకి జనరల్ మేనేజర్ అతుల్య కుమార్ నాయక్ సంతకాలు చేశారు.

ఒప్పందంపై సిఎంవో నుంచి తీవ్ర ఒత్తిడి

సెకి ఒప్పందంపై అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న ఇద్దరు ఉన్నతాధికారులు ఇతర శాఖల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. వీరిలో ఒకరు పదవీ విరమణ పొందగా, మరొకరు స్వచ్ఛంద విరమణ తీసుకున్నారు. ఒక్క అధికారి ఐదేళ్లపాటు సిఎంవోలో ఉండి బాగా అవినీతికి పాల్పడినట్లు అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. మరో అధికారి రెండున్నరేళ్ల పాటు ఉండి ఇతర ఉన్నతాధికారులపై దురుసుగా ప్రవర్తించడమే కాక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న వ్యక్తిని సిఎంతో చెప్పి బదిలీ చేయించారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- చంద్రబాబుపై దాడి కేసులో వైసిపి నేతలు పిటిషన్

ప్రజాశక్తి- అమరావతి

విపక్ష నేతగా చంద్రబాబు ఉన్నప్పుడు ఆయన ప్రధాన భద్రతాధికారి చేసిన ఫిర్యాదు ఆధారంగా కృష్ణా జిల్లా నందిగామ పోలీసులు పెట్టిన కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వైసిపి నేతలు ఎం.అరుణ్‌కుమార్, మొండితోక జగన్‌మోహన్‌రెడ్డి, చిరుమామిళ్ల శ్రీనివాస్‌రావులు హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు 2022 నవంబర్ 5న నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు ఇవ్వాలని కోరారు. అంతకు ముందు రోజు చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా నందిగామలో పర్యటించేందుకు వెళ్లారు. రైతు బజార్ వద్ద రాళ్ల దాడి జరిగింది. దీనిపై చంద్రబాబు ప్రధాన భద్రతాధికారి మదుసూధన్‌రావు గాయపడ్డారు. ఆ కేసులో పోలీసులు ఇటీవల రిమాండ్ రిపోర్టును కింది కోర్టులో సమర్పించారు. రాజకీయ కుట్రతో నమోదు చేసిన కేసు అయినప్పటికీ తాము పోలీసుల దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని పిటిషనర్లు రిట్లలో పేర్కొన్నారు.



అంబేద్కర్ పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే రక్ష


- కూటమి ప్రభుత్వ రాకతో ప్రజాస్వామ్యానికి పునరుజ్జీవం : సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే రక్ష అని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. అరాచక శక్తులు అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే ప్రజలు రాజ్యాంగం ఇచ్చిన ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతారని చెప్పారు. భారత రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందాలనేది రాజ్యాంగం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగ రచనలో నీలం సంజీవరెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు, ఆచార్య ఎన్‌జి రంగా, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వంటి 11 మంది తెలుగు వారు కీలకపాత్ర పోషించారన్నారు. దేశం గర్వించేలా జాతీయ జెండాను పింగళి వెంకయ్య రూపొందించారని గుర్తు చేశారు. రాజ్యాంగం ఎంత గొప్పదైనా దానిని అమలు చేసే వ్యక్తులు చెడ్డవారైతే దానివల్ల సమాజానికి చెడ్డే జరుగుతుందని అంబేద్కర్ చెప్పారని అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం ఉపయోగించాలే తప్ప వ్యక్తిగత స్వార్ధ ప్రయోజనాలకు వినియోగించకూడదన్నారు. గత ఐదేళ్లలో జిఒలను రహస్యంగా ఉంచారని, తాము అధికారంలోకి రాగానే పారదర్శకంగా అన్ని జీఓలను ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని సిఎం వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్‌లో భాగంగా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందించామన్నారు. అప్పటికి దేశం, ప్రపంచంలోనూ తెలుగు వారు మొదటి స్థానంలో ఉండాలని, రాష్ట్రాన్ని సంపన్న, ఆరోగ్య, సంతోషకర రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ ఆశయమని అన్నారు. అందరిచేత రాజ్యాంగ పీఠిక పఠనం చేయించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్, బాలవీరాంజనేయస్వామి, ఎస్ సవిత, పి.నారాయణ, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, బిసి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కృష్ణబాబు, అనంతరాము, ముఖ్య కార్యదర్శులు ముఖేష్‌కుమార్ మీనా, శశిభూషణ్‌కుమార్, హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పాలసీపై సిఎం సమీక్ష

నూతన టెక్స్‌టైల్ పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. రూ.10వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా ఈ పాలసీని రూపొందించిన్నట్లు తెలిపారు. తద్వారా 2లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చునని పేర్కొన్నారు. ప్రోత్సాహకాలు ఇచ్చి వీవింగ్, ప్రాసెసింగ్, గార్మెంట్స్ అండ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్లకు ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించారు. కొత్త పాలసీలో కేపిటల్ సబ్సిడీ పెంచాలని తెలిపారు. 2018-23 పాలసీ కంటే మరింత మెరుగ్గా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ రంగంలో వచ్చే పెట్టుబడుల ద్వారా గ్రామస్థాయిలో పెద్దఎత్తున మహిళలకు ఉపాధి కల్పించవచ్చని చెప్పారు. వస్త్ర తయారీలో పెట్టుబడులకు రాష్ట్రం ఉత్తమమైన వేదిక అవుతుందని తెలిపారు. టెక్స్‌టైల్ పాలసీతో పాటు లెదర్ పాలసీపైనా సమీక్ష నిర్వహించారు.



ఎంటి కృష్ణబాబు తదితరులను కలిసిన యూనియన్ నాయకులు

108 కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె వాయిదా

- యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి 108 అంబులెన్స్ సర్వీసెస్ కాంట్రాక్టు ఉద్యోగులు యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్ల పరిష్కారం కోసం మంగళవారం నుంచి తలపెట్టదలచిన సమ్మెను వాయిదా వేసినట్లు యూనియన్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్ సిఇఒ మంజుల, అదనపు సిఇఒ అప్పారావు, 108 నోడల్ అధికారి మురుగప్ప యూనియన్ నాయకులతో రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సుదీర్ఘంగా చర్చలు జరిపినట్లు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, అధ్యక్షులు బల్లి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె నోటీసులో పలు అంశాలపై రాతపూర్వకంగా ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. దీంతో సమ్మె నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. ఆందోళన కాలంలో మద్దతు తెలియపరిచిన వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, ట్రేడ్ యూనియన్ల నాయకులకు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకులకు, సహకరించిన ప్రభుత్వానికి, పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు. చర్చల్లో యూనియన్ ప్రధాన కార్యదర్శి కెవివి నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.మహేష్, ట్రెజరర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి పథకాలకు రుణ వెసులుబాటును పొడిగించండి

మొదటిపేజి తరువాయి

పిఠాపురంలో హాల్ట్ అవసరమని అన్నారు. లాతూరు నుంచి తిరుపతికి రైలు ఏర్పాటు చేయాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటికి కేంద్రం సాయం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు వీలుగా చేపట్టే కార్యక్రమాలకు కేంద్రం తగినన్ని నిధులివ్వాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని పవన్ కల్యాణ్ కోరారు. 2019-2024 మధ్య జల జీవన్ మిషన్ (జెజెఎం) కింద అందించిన కనెక్షన్లలో కుళాయిల సామర్థ్యం, నీటి నాణ్యత అంశంలో ఇటీవల చేసిన సర్వేతో పలు సమస్యలను గుర్తించామని పేర్కొన్నారు. ఈ సర్వే ఫలితాల ప్రకారం 29.79 లక్షల కుటుంబాలకు ట్యాప్ కనెక్షన్లు అందలేదని, అలాగే 2.27 లక్షల పంపులు పనిచేయడం లేదని చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం, అంగన్వాడీ, వ్యవసాయ ఉత్పత్తుల గిడ్డంగులు, మహిళా స్వయం సహాయక సంఘాల భవనాల నిర్మాణాలకు సంబంధించి అంచనా వ్యయం నిధులను పెంచాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పవన్ కల్యాణ్ కోరారు. వాటర్ షెడ్ పథకానికి రాష్ట్ర వాటా నిధులను తగ్గించి 90:10 దామాషా ప్రకారం నిధుల కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో 2,643 గ్రామాలకు అనుసంధాన రోడ్లు వేయాలని గుర్తిస్తే, దానిలో పిఎం గ్రామీణ సడక్ యోజన కింద 413 రోడ్లు నిర్మాణానికి మాత్రమే అనుమతి లభించిందని అన్నారు. 2,230 గ్రామాలకు ఇంకా అనుసంధాన రోడ్లు వేయాల్సి ఉందన్నారు. పర్యటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి కేంద్ర సహకారాన్ని కోరారు.

సౌర విద్యుత్ టెండర్ల అవినీతిపై సిఎంతో మాట్లాడి నిర్ణయం

కేంద్ర మంత్రులతో భేటీల అనంతరం పవన్ కల్యాణ్ స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సౌర విద్యుత్ టెండర్ల అవినీతిపై సిఎం చంద్రబాబుతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో సమోసాలకే రూ.9 కోట్లు ఖర్చు పెట్టారంటే ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారో అర్థం అవుతుందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలన్నారు. సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ కోసం పోలీసులు గాలిస్తున్న విషయంపై అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ 'ఉపముఖ్యమంత్రిగా నా పని నేను చేసుకుపోతున్నా.. పోలీసులు వాళ్ల పని వాళ్లు చేసుకుంటున్నారు. శాంతిభద్రతలు హోంమంత్రి చూస్తారు. ఆ పని నేను చేయడం లేదు' అని అన్నారు. గతంలో చంద్రబాబును ఇబ్బందిపెట్టిన సమయంలో ధైర్యంగా వ్యవహరించిన పోలీసులు.. ఇప్పుడెందుకు తటపటాయిస్తున్నారనే విషయాన్ని ముఖ్యమంత్రిని అడుగుతానని చెప్పారు. దీనిపై ఢిల్లీలో మీడియా వాళ్లు అడిగారని కూడా చెబుతా అని పవన్ అన్నారు.

చెవిరెడ్డిపై 'పోక్సో' కేసు ?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైసిపి నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై 'పోక్సో' కేసు నమోదైనట్లు సమాచారం. దీనితో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలం ఎల్లమంద గ్రామానికి చెందిన దళిత విద్యార్థినిపై అత్యాచారం జరిగినట్లు తప్పుడు ప్రచారం చేశారన్న బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు, మరికొంతమంది వైసిపి నేతలపై కేసు నమోదైనట్లు చర్చ నడుస్తోంది. అయితే దీనిపై పోలీసులు ఎటువంటి ప్రకటన చేయలేదు.

నేడు డిఎస్‌సి సిలబస్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సి సిలబస్ బుధవారం విడుదల కానుంది. త్వరలో విడుదల కానున్న మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ నేపథ్యంలో సిలబస్‌ను బుధవారం విడుదల చేస్తున్నామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదలయ్యేలోగా ఉపాధ్యాయ ఉద్యోగ అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వీలుకల్పిస్తూ సిలబస్ విడుదల చేస్తున్నామని వెల్లడించారు. apdsc2024.apcfss.in వెబ్‌సైట్‌లో బుధవారం ఉదయం 11 గంటల నుంచి అందుబాటులో ఉంచుతామని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో దారుణ హత్య

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో సినిమా తరహాలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కాలికి బరువైన రాయి కట్టి సముద్రంలో ఆ వ్యక్తిని పడేసి హత్య చేయడం చర్చనీయాంశమైంది. మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ పదో నెంబర్ జెట్టీ వద్ద సముద్రంలో తేలుతూ మృతదేహం కనిపించింది. దీన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సిఐ జి.దేవుడుబాబు సంఘటనా స్థలానికి చేరుకొని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో హత్యకు గురైన వ్యక్తి ఎవరనేది గుర్తించడం సాధ్యం కాలేదు. పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియా ద్వారా

ప్రజలను ప్రగతిశీల భావాల వైపు నడిపించాలి

- కేశవరెడ్డి స్మారక స్టూడియో ప్రారంభంలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సోషల్ మీడియా ప్రజాతంత్ర వేదికగా శక్తివంతంగా మారుతోందని, దీని ద్వారా ప్రజలను ప్రగతిశీల భావాల వైపు నడిపించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం, కేశవరెడ్డి వర్ధంతి సందర్భంగా సోషల్ మీడియా ఫర్ సొసైటీ అధ్వర్యాన విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం సాయంత్రం కొమ్మారెడ్డి కేశవరెడ్డి స్మారక స్టూడియోను అల్ ఇండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా వెళ్తోందని తెలిపారు. అయితే, ఇది పురోగమనంగా వెళ్తుందా? తిరోగమనం వైపు వెళ్తుందా? అన్నది చూడాలన్నారు. ఎక్కువగా తిరోగమనం వైపు పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద స్థాయిలో అబద్ధాలు, అసత్యాలు ప్రచారంలోకి వెళుతున్నాయని తెలిపారు. శాస్త్రీయ దృక్పథంతో పురోగమనంవైపు సమాచారం వెళ్లే విధంగా చూడాలన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సోషల్ మీడియా అంటే వివిధ పార్టీల నాయకులు తిట్టుకునే వేదిక కాదని, సమాజం కోసం ఆలోచించే వారికి చక్కని మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. రానున్న తరానికి చక్కటి విలువలు బోధించే విధంగా సోషల్ మీడియా వేదికగా ఉండాలని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. ఈ స్టూడియో కేశవరెడ్డి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో రూపుదిద్దుకుందన్నారు.

రానున్న కాలంలో మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సాంకేతికపరంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సోషల్ మీడియా ఫర్ సొసైటీ పర్యవేక్షణలో అభ్యుదయ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా స్టూడియో పని చేస్తుందని తెలిపారు. కేశవరెడ్డి ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని, ఎన్నో పుస్తకాలను అనువదించారని తెలిపారు. కేశవరెడ్డి అనువాదాలు సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, కేశవరెడ్డి కుటుంబ సభ్యులు డి.ఆంజనేయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంబివికె కార్యక్రమాల బాధ్యులు యు. వి.రామరాజు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్



పోలవరం ప్రాజెక్టు వద్ద చేస్తున్న ప్లాట్‌ఫారం పనులు

పోలవరం ప్రాజెక్టు ప్లాట్‌ఫారం పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన డయాఫ్రమ్ వాల్ ప్లాట్‌ఫారం పనులను జలవనరులశాఖ అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌కు నడుమ, పాత డయాఫ్రమ్ వాల్‌కి సమీపంలో నూతన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం కోసం ప్లాట్‌ఫారంను నిర్మిస్తున్నట్లు ఇఇ సుధాకర్ తెలిపారు. వచ్చే జనవరిలో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ముందస్తుగా ప్లాట్‌ఫాం పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నడుమ మట్టి, ఇసుక నాణ్యతా పరిశీలన కార్యక్రమాలు చేపట్టామన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి మెటీరియల్‌ను తరలించేందుకు వాహనాల రాకపోకల కోసం ఆ ప్రాంతంలో అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు.

శ్రీవారి హుండీలో చోరీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారి ఆలయంలోని హుండీ నుంచి ఓ సందర్శకుడు నగదు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. కొంత డబ్బుల్ని తీసి అక్కడి నుంచి పారిపోగా.. ఈ చోరీ సీన్ మొత్తం హుండీ సమీపంలో ఉన్న సిసి కెమెరాలో రికార్డైంది. ఈ విషయాన్ని శ్రీవారి ఆలయంలో భద్రతా సిబ్బంది గమనించి సిసి ఫుటేజ్ ఆధారంగా యువకుడిని గుర్తించి గాలించారు. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. చోరీకి పాల్పడిన యువకుడు తమిళనాడులోని శంకరన్ కోవిల్‌కు చెందిన వేణు లింగంగా గుర్తించారు. అతడి దగ్గర నుంచి రూ. 13,870 డబ్బుల్ని భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత అతడిని టిటిడి విజిలెన్స్ అధికారులు పోలీసులకు అప్పగించారు.

ప్రకృతి వైద్యంపై కోటిమందికి అవగాహన

- ఆయుష్ కమిషనరు డాక్టర్ మంజుల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆయుర్వేద వైద్య ప్రయోజనాలపై రాష్ట్రంలో కోటి మందికి పైగా ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యమని ఆయుష్ కమిషనరు డాక్టర్ మంజుల డి హోస్‌మణి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26 నుంచి డిసెంబరు 25 వరకు దేశ్‌కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ కార్యక్రమాలు జరుగుతాయని ఆమె తెలిపారు. ప్రచార కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యాధికారులు, ఆయుర్వేద అభ్యాసకులు ప్రకృతి వైద్యంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పిస్తారని వివరించారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆరోగ్య శిబిరాలు, పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీ సెంటర్లలో వర్క్‌షాపులు సెమినార్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య దేశాలకు దిక్సూచి

- సమాచార శాఖ ఎడి స్వర్ణలత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగం సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, సమానత్వ, సౌభ్రాతృత్వాలకు ప్రతీక అని సమాచార పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత అన్నారు. దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలోని సమాచార శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఉద్యోగులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వమానవ సమానత్వాన్ని సహేతుకంగా నిరూపించిన సమతావాది డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని అన్నారు. ప్రపంచంలో అనేక రాజ్యాంగాలకు భారత రాజ్యాంగం దిక్సూచిగా నిలుస్తోందన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటంలో రాజ్యాంగందే కీలక పాత్ర అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి పూర్ణచంద్రరావు, ఎడి భాస్కర నారాయణ, వెంకట్రాజ్ గౌడ్, జివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ సేవలు స్ఫూర్తిదాయకం

- డిజిపి ద్వారకా తిరుమలరావు
- చలం, శివశంకర్‌కు సాహిత్య విమర్శ పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో ఉన్నత అధికారిగా పని చేసిన తన తండ్రి సిహెచ్ లక్ష్మీనారాయణ తమకు విలువలతో కూడిన జీవన విధానాన్ని, క్రమశిక్షణను అందించారని.. తనతోపాటు తన సోదరి, సోదరుడు ఉన్నత స్థానాల్లో ఎదగటానికి వారు అందించిన జీవితపు విలువలు అమూల్యమైనవని, పలువురికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై సిహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సమితి ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, ప్రముఖ రచయిత, విమర్శకులు జిఎస్.చలంకు సాహిత్య విమర్శ పురస్కారాలను ప్రదానం చేశారు. డిజిపి సోదరి, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సుశీలమ్మ మాట్లాడుతూ.. సాహిత్య విమర్శకులను గుర్తించి, గౌరవించడం సామాజిక బాధ్యతగా భావించి గత ఐదేళ్లగా ప్రముఖులకు తమ తండ్రి పేరున పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సభకు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ భవానిదేవి అధ్యక్షత వహించారు. దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహ్మద్ షరీఫ్, డాక్టర్ ఒవి రమణ, డాక్టర్ వివి రామకుమార్, ఎస్ఎం సుబాని, పలువురు రచయితలు, సాహితివేత్తలు, విమర్శకులు పాల్గొన్నారు.



పాపినేని శివశంకర్, చలంను సన్మానిస్తున్న డిజిపి ద్వారకాతిరుమలరావు

అంబేద్కర్ రాజ్యాంగం అమలుకావట్లేదు : అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలులో లేదని, లోకేష్ రూపొందించిన రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులు, స్వేచ్ఛను కల్పించిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తప్ప పరిపాలనపై దృష్టి పెట్టడంలేదని విమర్శించారు. ప్రజలు త్వరలోనే వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

నారా లోకేష్ ఆదేశాల మేరకు పోలీసులు వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేసి అక్రమంగా జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా లోకేష్ డైరెక్షన్లో నడుస్తోందని, ఒక్కొక్క వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై 10, 15 కేసులు బనాయించి భయభ్రాంతులను గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా పాలనపై దృష్టి సారించాలని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

- ఆగంతకుల దుశ్చర్య
- దళిత, ప్రజాసంఘాల నిరసన
- అదే ప్రదేశంలో మరో విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల (ఏలూరు జిల్లా)


దేశవ్యాప్తంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు జరుపుకుంటుంటే ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో గుర్తు తెలియని వ్యక్తులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ప్రసిద్ధక్షేత్రమైన ద్వారకాతిరుమలలోని పంచాయతీ పార్కులో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం రాత్రి కూల్చివేశారు. దీనిపై స్థానికులు, దళిత, ప్రజాసంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమడోలు సిఐ ఎంజె.విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుధీర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పెద్దసంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పట్టుకుంటామని, అంతా సంయమనం పాటించాలని సిఐ కోరారు. ఆ విగ్రహం స్థానంలో మరో విగ్రహన్ని ఏర్పాటు చేశారు. అంబ్కేదర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని దళిత సంఘాలు, అంబేద్కర్ సేవా సమితి ఆందోళన నిర్వహించాయి.



ధ్వంసమైన విగ్రహం

అదానీకి రేటింగ్ ఏజెన్సీల భారీ దెబ్బ

- ఆయా కంపెనీల పరపతికి కోత
- తాజాగా మూడీస్, ఫిచ్ నిర్ణయం
- ఇప్పటికే ఎస్అండ్‌పి కోత
- స్టైబుల్ నుంచి నెగిటివ్ రేటింగ్
- కొత్త అప్పులు పుట్టడం కష్టమే
- షేర్లకు ప్రతికూలమే...!



న్యూఢిల్లీ : గౌతం అదానీకి గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు ఒకదాని వెనుక ఒక్కటి భారీ షాక్ ఇస్తున్నాయి. అదానీ లంచాలపై అమెరికన్ కోర్టులో అభియోగాలు నమోదు కావడం, భారత్‌లో తీవ్ర దుమారం రేగడంతో అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు అదానీ గ్రూపు కంపెనీల నిర్వహణ, పనితీరు, ఆర్థిక అంశాలను సమీక్షిస్తున్నాయి. ఇప్పటికే ఎస్అండ్‌పి అదానీ కంపెనీల పరపతికి కోత పెట్టగా.. తాజాగా మంగళవారం మూడీస్, ఫిచ్ ఏజెన్సీలు ఇప్పట్లో అదానీ కోలుకోని నిర్ణయం తీసుకున్నాయి. అదానీ గ్రూపులోని ఏడు కంపెనీల పరపతికి అడ్డంగా కోత పెడుతూ మూడీస్ నిర్ణయం తీసుకుంది. ఇందులో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పోర్ట్స్, రెండు అదానీ ట్రాన్స్‌మిషన్ సంస్థలు, అదానీ ఎలక్ట్రిసిటీ కంపెనీలు ఉన్నాయి. వీటి రేటింగ్‌ను స్థిరత్వం (స్టేబుల్) నుంచి ప్రతికూల స్థాయి (నెగిటివ్)కు తగ్గించింది. అదానీ గ్రీన్ ఎనర్జీ రేటింగ్‌ను బిఎ1కు తగ్గించింది. అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ ఎలక్ట్రిసిటీ, అదానీ పోర్ట్స్‌ల రేటింగ్‌ను బిఎఎ3కి కోత పెట్టింది.

నాలుగు కంపెనీలకు ఫిచ్ ఫంచ్

అదానీ గ్రూపులోని నాలుగు కంపెనీల పరపతికి అమెరికన్ క్రెడిట్ రేటింగ్ కంపెనీ ఫిచ్ కోత పెట్టింది. స్థిరత్వం నుంచి నెగిటివ్ రేటింగ్‌ను ఇచ్చింది. మరో మూడు సంస్థల రేటింగ్‌ను సమీక్షించనుంది. అదానీ ఇంటర్నేషనల్ కంటెయినర్ టెర్మినల్ ప్రయివేటు లిమిటెడ్ (ఎఐసిటిపిఎల్), అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ రిస్ట్రిక్టెడ్ గ్రూప్1, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ రిస్ట్రిక్టెడ్ గ్రూప్2, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌లకు ఇప్పటి వరకు బిబిబి రేటింగ్ ఉండగా.. ప్రతికూల రేటింగ్‌ను ఇస్తున్నట్లు ఫిచ్ తెలిపింది. అదే విధంగా అదానీ పోర్ట్స్‌కు బిబిబి మైనస్ పరపతిని కేటాయించింది. ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌కు బిబిప్లస్‌ని ఇచ్చింది.

మూడీస్, ఫిచ్ కంటే ముందే ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ కూడా నెగిటివ్ రేటింగ్‌ను ఇచ్చింది. అదానీ ఎలక్ట్రిసిటీ, అదానీ పోర్ట్స్‌కు మూడీస్ ప్రతికూల రేటింగ్‌ను కేటాయించింది. ఈ రెండు కంపెనీల రేటింగ్‌ను బిబిబి మైనస్‌కు తగ్గించినట్లు పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీకి కూడా నెగిటివ్ రేటింగ్‌ను ఇచ్చింది. ఇంతక్రితం వీటికి బిబి ప్లస్ రేటింగ్ ఉంది. అదానీ గ్రూపు కంపెనీల డైరెక్టర్ల బోర్డుల్లో సీనియర్ మేనేజ్‌మెంట్ (సిఇఒలతో సహా)లో అదానీ కుటుంబ సభ్యులు ఉండటం వల్ల వారు వ్యాపార వ్యూహం, వృద్ధి ప్రణాళికలు, ఆర్థిక విధానాలు, రిపోర్టింగ్, నిర్వహణ అంశాలను గణనీయంగా ప్రభావితం చేయగలరని ఎస్అండ్‌పి పేర్కొంది. వివిధ గ్రూప్ కంపెనీలు ట్రెజరీ, ఫైనాన్స్, టెక్నికల్ విభాగాలలో ఒకే రకమైన సమాచారాన్ని పంచుకోవడం ద్వారా సంస్థల నిర్వహణ, పాలనపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని తెలిపింది.

నిధుల సమీకరణకు గడ్డు కాలమే..

ఒక సంస్థకు రేటింగ్ ఏజెన్సీలు ఇచ్చిన పరపతి ఆధారంగానే అంతర్జాతీయ, జాతీయ ఇన్వెస్టర్లు, పెట్టుబడి సంస్థలు నిధులను సమకూర్చుతాయి. గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు ఒకదాని వెనుక మరొక్కటి అదానీ గ్రూపు కంపెనీల పరపతికి కోత పెట్టడంతో ఇకపై వాటికి కొత్త నిధులు పుట్టడం గగనమే. ఇప్పటికే అదానీ గ్రూప్ కంపెనీల్లో కొత్తగా ఎటువంటి పెట్టుబడులూ పెట్టబోమని ఫ్రెంచ్ ఇంధన దిగ్గజం టోటల్ ఎనర్జీస్ ఇఎస్ఇ ప్రకటించింది. ఇదే తరహాలో మరిన్ని కంపెనీలు, పెట్టుబడి సంస్థలు నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. అదే జరిగితే అదానీ వ్యాపారాల విస్తరణలో స్తబ్దత చోటు చేసుకోనుంది.

అదానీ షేర్ల పతనం..

గ్లోబల్ ఏజెన్సీలు అదానీ కంపెనీల పరపతికి కోత పెట్టడంతో అదానీ సంస్థల షేర్లు మరింత పడిపోనున్నాయి. మూడీస్ దెబ్బకు మంగళవారం అదానీ గ్రూపులోని 10 లిస్టెడ్ కంపెనీల షేర్లు భారీ నష్టాలను చవి చూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లు 8 శాతం మేర పతనమయ్యాయి. అదానీ పోర్ట్స్ 4 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 4 శాతం, అదానీ విల్మర్ 3 శాతం, అంబూజా సిమెంట్ 2.75 శాతం, ఎసిసి, ఎన్‌డిటివి షేర్లు ఒక్క శాతం పైగా నష్టపోయాయి. ఇంతక్రితం రెండు సెషన్లలో మాత్రం మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్‌డిఎ గెలుపొందడంతో అదానీ షేర్లకు మద్దతు లభించింది. మూడీస్, ఫిచ్, ఎస్అండ్‌పి ఏజెన్సీల రేటింగ్ కోత వచ్చే మార్కెట్ సెషన్లలో అదానీ కంపెనీల షేర్లను తీవ్ర ఒత్తిడికి గురి చేసే అవకాశం ఉందని.. రిటైల్ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

జివిఎంసి జోనల్ కమిషనర్‌పై ఎసిబి దాడులు

- ఒకేసారి ఆరుచోట్ల సోదాలు



ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఎసిబి అధికారులు విశాఖ జివిఎంసి జోన్ - 2 కమిషనర్ పొందూరు సింహాచలం ఇంటిపై మంగళవారం దాడులు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రోజంతా ఈ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఆయన ఇళ్లు, కార్యాలయంలో తొలుత సోదాలు జరిపారు. అనంతరం కేసు నమోదు చేశారు. ఎసిబి డిజి అతుల్ సింగ్ ఆదేశాల మేరకు విశాఖ అధికారులు స్థానిక స్పెషల్ జడ్జి అనుమతితో మొత్తం ఆరు ప్రదేశాల్లో సోదాలు చేపట్టారు. మధురవాడ మిథిలాపురి కాలనీలో ఉన్న సింహాచలం ఫ్లాట్‌తో పాటు మధురవాడలోని జోనల్ కార్యాలయం, శ్రీకాకుళం జిల్లాలోని సింహాచలానికి చెందిన ముగ్గురు బంధువుల ఇళ్లు, హైదరాబాద్‌లోని బంధువుల ఇళ్లలోనూ ఈ సోదాలు ఏకకాలంలో సాగాయి. విశాఖలోని మద్దిలపాలెంలో ఫ్లాట్, నగరంలోని నాలుగు ఇళ్ల స్థలాలు, శ్రీకాకుళంలో 13 ఇళ్ల స్థలాలు, విజయవాడలో ఒక ఇంటి స్థలం, శ్రీకాకుళం జిల్లాలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి, ఒక మారుతి బ్రీజా కారు, బంగారు ఆభరణాలు ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటి వరకూ జరిగిన దర్యాప్తులో రూ.2 కోట్ల విలువైన ఆస్తులు ఆదాయానికి మించి కలిగి ఉన్నట్లు తెలిసింది. సోదాలు ఇంకా కొనసాగుతున్నట్టు అధికారులు ప్రకటించారు. ఎసిబి జెడి ఎం.రజని, అదనపు ఎస్‌పి ఎన్.విష్ణు, డిఎస్‌పి బివిఎస్.నాగేశ్వరరావు, డిఎస్‌పి రమ్య పర్యవేక్షణలో జరిగిన ఈ సోదాల్లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, కర్నూలు ప్రాంతాల ఎసిబి అధికారులు పాల్గొన్నారు. త్వరలోనే సింహాచలాన్ని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెడతామని దర్యాప్తు అధికారి, విశాఖ ఎసిబి ఇన్‌స్పెక్టర్ వైకె.కిషోర్ కుమార్ తెలిపారు.

గ్రావ్టాన్ నుంచి క్వాంటా

- కొత్త ఎలక్ట్రిక్ మోటర్ సైకిల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్



గ్రావ్టాన్ మోటార్స్ దేశంలోనే తొలిసారి టెర్రెన్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ 'క్వాంటా'ను విడుదల చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో దీనిని ఆ కంపెనీ సిఇఒ పరశురాం పాక ఆవిష్కరించారు. దీని ధరను రూ.1.2 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో దేశంలోనే తొలిసారి ఇంటిగ్రేట్ లిథియమ్ మంగనీస్ ఐరన్ పాస్ఫేట్ (ఎల్ఎంఎఫ్‌పి) బ్యాటరీని అమర్చినట్లు పరశురాం తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న తమ సంస్థ ఏడాదికి 30,000 యూనిట్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. ఇది తమ ఐదేళ్ల కష్టానికి ఫలితమన్నారు. ఇప్పటి వరకు రూ.40 కోట్లు పెట్టుబడులు పెట్టామని.. వచ్చే ఏడాదిన్నరలో మరో రూ.110 కోట్ల వ్యయం చేయనున్నామన్నారు.

పెన్షనర్ల కమ్యుటేషన్ పోర్షన్ రికవరీ నిలుపుదల

- రికవరీ గడువు 15 ఏళ్లనుంచి 11 ఏళ్ల 3 నెలలకు తగ్గింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ట్రెజరీ పెన్షన్‌దారులు ఎవరైతే కమ్యుటేషన్ పోర్షన్ రికవరీ మొదలైనప్పటి నుంచి 11 సంవత్సరాల మూడు నెలల కాలాన్ని పూర్తి చేసుకున్నారో ఇక నుంచి వారి ప్రాథమిక పెన్షన్ నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎలాంటి రికవరీ చేయకూడదంటూ ప్రభుత్వం ట్రెజరీ అధికారులకు మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఇప్పటి వరకు కమ్యుటేషన్ పోర్షన్ రికవరీ 15 సంవత్సరాలు ఉండేది. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో రికవరీ సమయం తగ్గిపోవడంతో వేలాదిమంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది.

ఇప్పటికే తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒరిస్సా, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు రికవరీ నిలుపుదల చేశాయని, అదే తరహాలో రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఎపి జెఎసి అమరావతి అనుబంధ సంఘమైన ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పిఎస్ఎన్ఎన్‌పి శాస్త్రి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వివి మురళీకృష్ణమనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ఎపిజెఎసి అమరావతి చైర్మన్, ప్రధాన కార్యదర్శి బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు. పెన్షనర్లకు లబ్ధి చేకూర్చిన సిఎం చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టెల్కోలకు బ్యాంక్ గ్యారంటీ నిబంధన రద్దు

- విఐ షేర్ల పరుగు

ముంబయి : టెలికం కంపెనీలు బ్యాంక్ గ్యారంటీలు సమర్పించాల్సిన నిబంధనను ఎత్తివేస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో టెలికాం కంపెనీలపై ఆర్థికంగా భారం తగ్గనుందని ఆ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 2022కు ముందు నిర్వహించిన వేలంలో స్పెక్ట్రం దక్కించుకున్న టెలికాం కంపెనీలు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలన్న నిబంధనను కేబినెట్ తొలగించింది. చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ చెల్లింపులకు సంబంధించి వొడాఫోన్ ఐడియా వచ్చే 2025 అక్టోబర్ నుంచి 2026 సెప్టెంబర్‌ల మధ్య దాదాపు రూ.24,746 కోట్లు విలువైన బ్యాంకు గ్యారెంటీలను సమర్పించాల్సి ఉంది. తాజా నిర్ణయంతో తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న విఐకి భారీ ఉపశమనం లభించినట్లయ్యింది. దీంతో మంగళవారం ఇంట్రాడేలో విఐ షేర్లు 17 శాతం మేర పెరిగాయి. తుదకు బిఎస్ఇలో 7.88 శాతంతో రూ.7.53 వద్ద ముగిసింది. ప్రభుత్వరంగ టెలికాం సంస్థ ఎంటిఎన్ఎల్ షేర్ 2.60 శాతం పెరిగి రూ.48.54 వద్ద ముగిసింది.

మార్కెట్లకు నష్టాలు..

మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్‌డిఎకి మెజారిటీ దక్కడంతో రెండు రోజులు లాభాల్లో సాగిన స్టాక్ మార్కెట్లు మంగళవారం నేల చూపులు చూశాయి. ఉదయం లాభాల్లో మొదలయిన స్టాక్స్.. మధ్యాహ్నం వరకు పెరుగుతూ వచ్చి.. ఆ తర్వాత చివరిలో అమ్మకాలను చవి చూశాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ చివరకు 106 పాయింట్లు పతనమై 80,004కు దిగజారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 27.40 పాయింట్ల నష్టంతో 24,194.50 వద్ద ముగిసింది. 2,179 షేర్లు లాభపడగా.. 1,580 షేర్లు నష్టపోగా.. 105 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి.

మోతిలాల్ ఓస్వాల్ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

ముంబయి : మోతిలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ కాపిటల్ మార్కెట్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఎన్ఎఫ్ఒ నవంబర్ 26న ప్రారంభమై.. డిసెంబర్ 10తో ముగియనుంది. డిసెంబర్ 20న తిరిగి తెరుచుకోనుంది. మార్కెట్ థీమ్ కింద జాబితా చేయబడిన స్టాక్స్, వృద్ధి సామర్థ్యాన్ని ఈ ఫండ్ అందిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. నిఫ్టీ 500లో భాగమైన 15 కంపెనీలు కూడా ఉన్నాయని పేర్కొంది.

జెఎల్‌ఆర్ నుంచి డిఫెండర్ జర్నీ మూడో ఎడిషన్

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ జాగ్వర్ లాండ్ రోవర్ తన డిఫెండర్ జర్నీ మూడో ఎడిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఇందులో పాల్గొనే క్లయింట్లకు విలాసవంతమైన బస, ఆతిథ్యం అందించబడుతుందని పేర్కొంది. థార్ ఎడారి, జన్‌స్కార్ వ్యాలీ, ఉమ్లింగ్ లా పాస్, లద్దాఖ్ రీజియన్, స్పిటీ వ్యాలీ, కొంకణ్ రీజియన్ లాంటి కీలక ప్రదేశాల్లో ఈ సారి జర్నీ సాగనుందని ఆ సంస్థ తెలిపింది. తమ తొలి రెండు సీజన్లలో 420 మంది క్లయింట్లు ఉత్సాహంగా పాల్గొన్నారని జెఎల్‌ఆర్ ఇండియా ఎండి రాజన్ అంబ పేర్కొన్నారు.

సంపాదకీయం

కాప్ 29 తంతు


వాతావరణ మార్పుల కారణంగా తలెత్తుతున్న దుష్ప్రభావాలను తగ్గించేందుకు అజర్ బైజాన్‌లోని బాకులో జరిగిన కాప్ 29 సదస్సు ఫలవంతమైన కార్యాచరణను ప్రతిపాదించకుండానే ముగిసింది. ఈనెల 11వ తేదీన మొదలై, 22వ తేదీ వరకూ 12 రోజుల పాటు జరిపిన చర్చలు సంపన్న దేశాల స్వార్థగుణాన్ని, పర్యావరణం పట్ల వాటి పాక్షిక దృష్టిని మరోసారి బయటపెట్టాయి. తాము సృష్టిస్తున్న కాలుష్యాన్ని, కర్బన ఉద్గారాల పాపాన్ని ప్రపంచం నెత్తిన వేసి, తాము చేతులు దులుపుకోవాలన్న అతి తెలివితోనే అవి వ్యవహరించాయి.

దేశాలకు సరిహద్దులు ఉంటాయి కానీ, పర్యావరణాన్ని హరించే కర్బన ఉద్గారాల వ్యాప్తికీ, వాటి పర్యవసానాలకు నియంత్రణ రేఖలు ఉండవు. ధనిక దేశాలు ఏళ్ల తరబడి అనుభవిస్తున్న సర్వ సౌఖ్యాలకు ప్రకృతి వనరులు దహించి వేసి, కీడు ఉద్గారాలను భూగోళం మీదికి వదులుతున్నాయి. ప్రపంచం మొత్తం మీద విడుదలవుతున్న కర్బన ఉద్గారాల్లో 75 శాతం వాటా ధనిక దేశాలదే! సహజ వనరుల విచ్చలవిడి వినియోగంతో తరుముకొస్తున్న ఈ ఉద్గారాల విపత్తు భూరక్షక హరిత వలయానికి చిల్లులు పెట్టి, ప్రపంచం మొత్తాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ పాపం పూర్తిగా సంపన్న దేశాలది కాగా, దాని పర్యవసానాలకు బదుగు, వర్ధమాన దేశాలు బలి కావల్సి వస్తోంది. ఈ వాస్తవాన్ని అంగీకరించటానికి, పర్యావరణ పరిరక్షణలో తదనుగుణమైన పాత్ర వహించటానికీ ధనిక దేశాలు సంపూర్ణ సంసిద్ధతను వ్యక్తం చేయటం లేదు. అందువల్ల రోజుల తరబడి సదస్సులు జరిగినా తూతూమంత్రపు తలూపులతోనే అవి తంతుగా మిగిలిపోతున్నాయి.

కాప్ 29 సదస్సులో వర్ధమాన దేశాలు ఒక్కతాటిపై నిలిచి, సంపన్న దేశాల నిర్దిష్ట బాధ్యతను గుర్తు చేశాయి. 'ఎంత హరిస్తున్నారో అంత భరించాలి' అన్న న్యాయబద్ధమైన హితవుతో ఏటా 1.3 లక్షల కోట్ల డాలర్లను పర్యావరణ రక్షణకు వెచ్చించాలని కోరాయి. కానీ, ధనిక దేశాల సన్నద్ధత 30 వేల కోట్ల డాలర్ల దగ్గరే ఆగిపోయింది! ఈపాటిదానికి పన్నెండు రోజుల పాటు పర్యావరణ హితమంటూ ప్రపంచమంత రాగం తీయటం దేనికి? ఏ దేశం ఎంత కాలుష్య కారకమవుతుందో, ఏ దేశం ఎంతెంత పచ్చదనంతో ప్రపంచపు ఆరోగ్యానికి కారణమవుతుందో పక్కాగా లెక్కలను అనేక నివేదికలు ఘోషిస్తూనే ఉన్నాయి. అలాంటప్పుడు పర్యావరణ ధ్వంస సంపన్న దేశాలు హరిత సౌభాగ్యానికి తోడ్పడుతున్న వర్ధమాన దేశాలకు నిండుగా నిధులిచ్చి, ప్రోత్సహించటం అత్యంత అవసరమైన బాధ్యత. ఆ కనీస వివేచనను విడిచిపెట్టి, కొద్దిపాటి విదిలింపులతోనే సరిపెట్టటం, అదేదో తమ దాతృత్వ గుణానికి దాఖలాలా వ్యవహరించటం సబబు కాదు. పైగా ఈపాటి మాటకైనా ఆచరణ ఏమాత్రంగా ఉంటుందన్నది సందేహాస్పదమే! క్లయిమేట్ ఫైనాన్స్ కింద ఏటా 10 వేల కోట్ల డాలర్లు ఇస్తామని 2009లో సంపన్న దేశాలు ఒప్పుకున్నాయి. కానీ, గడచిన పదమూడేళ్లలో దానిని పాటించింది ఒక్కసారే! ఇలాంటి మాట తప్పుడు తంతుతో పర్యావరణానికి ఏమాత్రమూ మేలు జరగదు.

ధనిక దేశాల పక్షపాత వైఖరిని, బాధ్యతారాహిత్యాన్ని వర్ధమాన దేశాలు గుర్తించి, గర్హించటం దాదాపు ప్రతి కాప్ సదస్సులోనూ జరుగుతోంది. ఈసారి కూడా తగిన మొత్తంలో పర్యావరణ నిధిని ఇవ్వాల్సిందేనని సంపన్న దేశాలను వర్ధమాన దేశాల ప్రతినిధులు నిలదీసిన ప్రతిసారీ హర్షధ్వానాలు మార్మోగాయి. "సంపన్న దేశాల వద్ద నిధులు లేక కాదు; అవి భౌగోళిక రాజకీయాలకు పాల్పడడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది" అని కొలంబియా పర్యావరణ శాఖ మంత్రి సుశానా మహ్మద్ వ్యాఖ్యానించినప్పుడు ప్రతినిధులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సదస్సు నీడన సంపన్న దేశాలు తమ వ్యాపారాలను విస్తరించుకోవటానికి అనేక ప్రతిపాదనలను, ఒప్పందాలను ముందుకు తెచ్చాయి. క్లయిమేట్ ఫైనాన్స్‌ని అంతర్జాతీయ పెట్టుబడుల వ్యూహంగా మార్చే పన్నాగాలకు పదును పెట్టాయి. కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రాజెక్టులకు పెట్టుబడులు పెడతామంటూ కార్పొరేటు దిగ్గజాలు బరిలోకి దిగటం ఇందులో భాగమే! అసలు ప్రమాదాన్ని చిత్తశుద్ధితో ఎదుర్కోకుండా లాభార్జన దుర్బుద్ధితో వ్యవహరిస్తే భూగోళం మరింత రుజాగ్రస్తం అవుతుంది. ఈ ఎత్తుగడలను తుత్తనియలు చేస్తూ, సంపన్న దేశాల మెడ మీద బాధ్యతల కాడిని మోపటం వర్ధమాన దేశాల ఉమ్మడి బాధ్యత.

మహనీయుల మాట



ఓ మల్లె గింజ మహా వృక్షమైనట్లే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం సైతం మహా ఫలితాన్నిస్తుంది.


- స్టాన్ స్లావిస్కి
రష్యన్ నటుడు, దర్శకుడు

విశ్లేషణ

పేదల కోణం లోపించిన గ్రాబింగ్ చట్టం

కె.ఎస్.వి.ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ భూ దురాక్రమణ (నిషేధం) చట్టం-2024 ఉభయ సభల్లో ఆమోదం పొందింది. శాసనసభలో ఉన్న ఒక్క ప్రతిపక్ష పార్టీ వైసిపి సభకు వెళ్లనందున అక్కడ ఎలాంటి అభ్యంతరాలకు, సలహాలకు ఆస్కారం లేదు. శాసన మండలిలో పిడిఎఫ్ సభ్యులు చేసిన సూచనలను టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ చట్టం పేదలపై పాలకులు ఎక్కుపెట్టిన బ్రహ్మాస్త్రం వలే ఉందంటూ పేదలు, ప్రజాసంఘాలు వెలిబుచ్చుతున్న భయాందోళనలను కూటమి సర్కారు నివృత్తి చేయలేదు. పేదలకు అన్యాయం తలపెడతాయని సందేహిస్తున్న క్లాజులను తొలగించాలన్న డిమాండ్‌ను తిరస్కరించింది. సెలెక్టు కమిటీకి కూడా సిఫారసు చేయలేదు. కేంద్ర చట్టాలతో ముడిపడి ఉన్నందున రాష్ట్ర ఉభయ సభల్లో బిల్లు ఆమోదమయ్యాక, గవర్నర్ నుంచి రాష్ట్రపతి పరిశీలన, ఆమోదం కోసం వెళుతుంది. పైన బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉంది కనుక, అది టిడిపిపై ఆధారపడి ఉంది కనుక, ఇటువంటి చట్టం గుజరాత్, ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల్లో తెచ్చినందున, సులువుగానే రాష్ట్రపతి వద్ద క్లియర్ అవుతుంది. అయితే, అసెంబ్లీలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులో దాన్ని ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందో పేర్కొన్న 'ఉద్దేశాలు-కారణాల'ను పరిశీలించినట్లయితే, రాష్ట్రంలో వేగవంతంగా జరుగుతున్న పట్టణీకరణ, వ్యాపారీకరణలు ప్రభుత్వ, ప్రైవేటు భూముల దురాక్రమణలకు ఉత్ప్రేరకాలుగా ఉన్నాయని, రాష్ట్రంలో ఇటీవలి కాలంలో చోటు చేసుకుంటున్న భూకబ్జాలు, సంబంధిత పరిణామాల వలన అన్ని వర్గాలూ ఇబ్బందులు పడుతున్నాయని, వాటిని అరికట్టడానికి చట్టం తెస్తున్నామని తెలిపారు. ఎ.పి. భూ దురాక్రమణ (నిషేధం) చట్టం-1982 కంటే గట్టి చట్టం తెస్తున్నందున, ఇప్పటి వరకు ఉనికిలో ఉన్న ఆ చట్టాన్ని రద్దు చేస్తున్నామన్నారు. పాత చట్టానికి, కొత్త చట్టానికి మధ్య పెద్దగా వ్యత్యాసం లేదు. '1982' యాక్ట్ అప్పటి ఉమ్మడి ఎ.పి.లోని అర్బన్ ప్రాంతాలకు పరిమితంకాగా, '2024' బిల్లులో రూరల్, అర్బన్ సహా రాష్ట్రం మొత్తానికీ వర్తిస్తుంది. అప్పుడూ ఇప్పుడూ ల్యాండ్ గ్రాబర్ అనే దానికి నిర్వచనం మక్కికి మక్కికి దించారు. ప్రభుత్వ, ఎండోమెంట్, వక్ఫ్, చారిటబుల్, ప్రైవేటు భూముల ఆక్రమణలను నేరాలుగా పరిగణించి శిక్షిస్తామన్నారు. పాత చట్టంలో భూముల కబ్జాకు పాల్పడిన వారిపై అభియోగం రుజువైతే ఆరు నెలలకు తక్కువ కాకుండా జైలు శిక్ష అన్నారు. జైలు శిక్షను ఐదేళ్ల వరకు వేయొచ్చు. ఐదు వేల రూపాయల జరిమానా కూడా అన్నారు. కొత్తగా తీసుకొచ్చిన బిల్లులో పదేళ్లకు తక్కువ కాకుండా జైలు శిక్ష అన్నారు. పద్నాలుగేళ్ల వరకు జైలు శిక్ష విస్తరించవచ్చు అన్నారు. కబ్జాకు గురైన ఆస్తి మార్కెట్ విలువను జరిమానాగా వేస్తారు. ప్రత్యేక కోర్టులు అప్పుడూ ఇప్పుడూ ఉన్నాయి. ఆ కోర్టులను ఏర్పాటు చేసే, జడ్జిలను నియమించే అధికారం, రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి దఖలు పర్చారు. సర్కారు ఎప్పుడైనా ఆ పని చేయొచ్చు. 1982 జూన్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. తదుపరి ఆగస్టులో అసెంబ్లీలో బిల్లు పెట్టింది. 1982 ఆగస్టు 10న ఆ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా సిపిఎం అగ్ర నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య మాట్లాడుతూ ఎప్పుడు పడితే అప్పుడు కోర్టులను, జడ్జిలను ఏర్పాటు చేసే, రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి దఖలు పరిస్తే, ఒక వేళ ప్రభుత్వంలో ఉన్న వారిపైనే భూకబ్జా అభియోగాలు వస్తే, శిక్షల దాకా వెళితే సదరు కోర్టులను, జడ్జిల నియామకాలను బతకనిస్తారా, ఆ గ్యారంటీ బిల్లులో లేదని నిలదీశారు. రద్దు చేసిన చట్టంలో ఏముందో, కొత్తగా తెచ్చిన చట్టంలోనూ అదే ఉంది. ఇక్కడే ప్రభుత్వ నైజం అర్థమవుతుంది. నాలుగున్నర దశాబ్దాలలో పరిస్థితుల్లో మార్పొచ్చింది. అదానీ వంటి వారు భూకబ్జాలకు పాల్పడి శిక్షలు పడే దాకా వస్తే, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి స్పెషల్ కోర్టులను, జడ్జిలను రద్దు చేయిస్తారు. చట్టంలో పొందుపర్చిన ఈ లొసుగు ముందు ల్యాండ్ గ్రాబ్ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి, డిఎస్‌పి స్థాయికి తక్కువ కాకుండా అధికారితో దర్యాప్తు చేయించాలి, ఆర్నెల్లలో విచారణ పూర్తి కావాలి అనేవి చాలా చాలా చిన్నవి.



మతలబు ఇదే

బిల్లులో పేర్కొన్న శిక్షల విషయానికొస్తే జైలు శిక్ష, జరిమానా అన్నారు. కబ్జాకు పాల్పడిన ఆస్తి మార్కెట్ విలువను గ్రాబర్ నుంచి వసూలు చేస్తామంటున్నారు. ఇక్కడ మార్కెట్ విలువంటే రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఉండే బుక్ వాల్యూనా లేదంటే బహిరంగ మార్కెట్‌లో క్రయవిక్రయాల రేటా అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ బుక్ వాల్యూనే అయితే గ్రాబర్‌కే లాభం. గ్రాబింగ్ చట్టబద్ధమైపోతుంది. అందుకే కబ్జా చేసిన ఆస్తిని ప్రభుత్వం జప్తు చేస్తే కబ్జాదారులకు సరైన శిక్ష అవుతుంది. జైలు శిక్ష, జరిమానాతో పాటు ఆస్తి జప్తు కూడా చట్టంలో ఉండాలి. బిల్లులో ఆ అంశం లేదు. అందువల్లనే కొత్త చట్టం ఆర్థికంగా, రాజకీయంగా బలవంతులైన పెద్ద వాళ్లకు, కార్పొరేట్లకు చుట్టం అవుతుందని సందేహించాల్సి వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భూములను ఆక్రమించుకున్నవారు ల్యాండ్ గ్రాబర్ల కిందకు వస్తారని బిల్లు చెబుతోంది. ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ భూముల్లో వంద యాభై గజాల్లో నివాసాలు ఏర్పరుచుకుంటే చట్ట ప్రకారం ల్యాండ్ గ్రాబర్ అయిపోతారు. ఇళ్లు వేసుకోమని పేదలను ప్రోత్సహించిన వారు కూడా నేరస్తులవుతారు. ప్రభుత్వ, ఎండోమెంట్, వక్ఫ్ భూములను ఎకరమో, రెండెకరాలో సాగు చేసుకుంటున్న పేదలు భూ దురాక్రమణ దారులై శిక్షలకు గురవుతారు. కొంత మంది పెద్దలు ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లు వేసి దర్జాగా అమ్ముకుంటున్నారు. చౌకగా వస్తుందన్న ఆశతో సామాన్యులు కొంటున్నారు. ఎవరు ప్రస్తుతం పొజిషన్‌లో ఉన్నారో వారు గ్రాబర్ అయిపోతారు తప్ప అక్రమంగా భూములను ఆక్రమించి అమ్మిన అసలు వ్యక్తి తప్పించుకుంటారు. ఒక వేళ భూ దురాక్రమణ ఆరోపణలొచ్చినా వ్యవస్థలను మేనేజ్ చేసే పలుకుబడి అటువంటి పెద్దలకు ఎలాగూ ఉంటుంది. అపరాధులయ్యేది పేదలు, చిన్నవాళ్లే. అందుకే పేదలకు, చిన్న చిన్న వారికి కొంత వరకు మినహాయింపులుండాలి. ప్రభుత్వ అభ్యంతరాల్లేని నివాసాలకు ప్రభుత్వం కొంత విస్తీర్ణ పరిమితి పెట్టి పట్టాలిస్తోంది. అనధికారిక బిల్డింగ్‌లను రెగ్యులరైజ్ చేస్తోంది. అలాగే చట్టంలో పొందుపర్చాలి. పెద్దలను పట్టుకొని కఠినంగా శిక్షించాలి. అటువంటి సదుద్దేశం బిల్లులో కనిపించదు. పాత చట్టం ఉన్నా ఆచరణలో పేదలకు, సామాన్యులకు నష్టం జరిగింది. అర్బన్ ప్రాంతాల్లో యథేచ్ఛగా పెద్దల ఆక్రమణలు సాగిపోయిన అనుభవం ఉండనే ఉంది. రియల్ ఎస్టేట్ మాఫియా కబ్జాలు, వీరంగాలు రోజూ చూస్తున్నవే. ఆ కారణంగానే 2024- ల్యాండ్ గ్రాబింగ్ చట్టంపై పేదల్లో, ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.


అసైన్డ్‌లో జరుగుతున్నదేంటి?

1977- అసైన్డ్ ల్యాండ్ చట్ట సవరణల సమయంలోనూ ఎస్‌సి, ఎస్‌టి, పేదలు నష్టపోతారన్న భయాలు వ్యక్తమయ్యాయి. ఆచరణలో నిజం అయ్యాయి కూడా. 1977-చట్ట ప్రకారం అసైన్డ్ భూములు అమ్మడం, కొనడం నిషిద్ధం. 2019లో టిడిపి ప్రభుత్వం దిగిపోయే ముందు అసైన్డ్ ఇళ్ల స్థలాలు పొంది 20 సంవత్సరాలు దాటితే ఒరిజనల్ ఎస్సయినీలకు సర్వ హక్కులూ కల్పిస్తూ చట్టం తెచ్చింది. అమరావతి ప్రాంతంలో ఐదేళ్ల గడువుపై చట్టానికి ప్రయత్నించగా నాటి గవర్నర్ అంగీకరించలేదు. అదే దారిలో ఐదేళ్ల కాలపరిమితి పెట్టి సర్వ హక్కులూ అంది వైసిపి సర్కారు. కోర్టులు అంగీకరించకపోయే సరికి అసైన్డ్ వ్యవసాయ భూములకు 20 ఏళ్లు, ఇళ్ల స్థలాలకు పదేళ్ల కాల పరిమితి పెట్టి జగన్ సర్కారు సవరణ చట్టం తెచ్చింది. ఈ చట్టం పైకి బాగానే ఉన్నట్లు కనిపించినా కార్యక్షేత్రంలో చూస్తే అసైన్ భూములను అక్రమంగా కొనుగోలు చేసిన, ఆక్రమించిన, బెదిరించి లాక్కున్న పెద్దలకే ఎక్కువగా ఉపయోగ పడుతోంది. ఈ పూర్వరంగంలో ప్రస్తుత ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) చట్టం కూడా అంతే. ల్యాండ్ గ్రాబింగ్ (నిషేధం) చట్టంపై ప్రజల్లో సందేహాలు, భయాందోళనలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఏపక్షంగా చట్టం చేయబూనుకోవడం ప్రజా ప్రభుత్వం అనిపించుకోదు. రాజకీయ పార్టీలు, ప్రజలు, ప్రజాసంఘాలు, మేధావులతో విస్తృతంగా చర్చించి వారి నుంచి అభిప్రాయ సేకరణ చేస్తే ప్రభుత్వానిది సదుద్దేశం అనిపించుకుంటుంది. చట్టాన్ని అమలు చేసే ముందైనా అన్ని పక్షాలతో చర్చలు జరపాలన్న డిమాండ్ సహేతుకమైనది. ఎలాంటి చర్చలు, సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా చేసే చట్టం ఆచరణలో నిలబడదు. అప్పటికి తాత్కాలిక రాజకీయ కక్షలకు ఉపయోగపడితే పడవచ్చు. ప్రధానంగా పేద ప్రజలకు నష్టం జరగకూడదు. పేదల పక్షాన, వారి హక్కుల కోసం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించే సంస్థలపై, వ్యక్తులపై అణచివేత, నిర్బంధాలకు ప్రభుత్వానికి చట్టం ఆయుధం కాకూడదు. అప్పుడే 'మంచి ప్రభుత్వం' అవుతుంది.

/ వ్యాసకర్త సెల్ : 9490099019 /

సుందరయ్య మాట

/1982 ఆగస్టు 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ (నిషేధం) బిల్లు, 1982పై శాసనసభలో పుచ్చలపల్లి సుందరయ్య చేసిన ప్రసంగం నుంచి కొన్ని భాగాలు/




- నేను ప్రతిపాదించినవి మూడు ముఖ్యమైన సవరణలు వున్నవి. ల్యాండు గ్రాబింగ్ డిఫినెషన్ బాగానే వుంది. ల్యాండు గ్రాబింగ్ పదం 100 స్క్వేర్ మీటర్లు వుండి దానిలో చిన్న ఇల్లో, గుడిసెనో కట్టుకుని ఒక నిరుపేదవాడువుంటే ఎక్కడ కూడా అతనికి ఆస్తి లేనప్పుడు, ఇల్లు లేనప్పుడు అతని ఆస్తి రూ.25 వేలు కన్నా ఎక్కువ లేనప్పుడు అటువంటి వాడు ల్యాండు గ్రాబర్ కాదు, అతను నివసించే ల్యాండు.. ల్యాండు గ్రాబింగ్ కాదు అన్నాము. ఎవరు మూల కారకులో వారిని బయటపెట్టి వారి గొంతు పట్టుకుంటే సరిపోతుంది. మిగిలినవారిని పట్టుకోవాల్సిన అవసరం ఉండదు. వారికే ఈ బిల్లు ఉద్దేశించాలి అంటే అది చేయడం లేదు.
- జంట నగరాలలో 100 గజాలు తీసుకున్న వారిని ల్యాండు గ్రాబరు అంటే ఎలాగా? పెద్దవారిని పట్టుకోండి అంటే మావల్ల కాదని అంటున్నారు. అందుచేత చిన్నవారిని పట్టుకుంటారన్న మాట. వారిమీద దాడి చేయడానికి, ఈ బిల్లును సర్వనాశనం చేయడానికి ప్రభుత్వానికి ఒక ఆయుధంగా ఉంటుంది తప్ప ఇంకొకటికాదు.
- రూ.25 వేలు విలువ చేసే ఆస్తి లేనటువంటి వారు నెలకు రూ.500 కన్నా ఎక్కువ ఆదాయం లేనటువంటివారు ఎక్కడో గుడిసె వేసుకుంటే వారిని పట్టుకుంటామని అంటున్నారు. మీ వెనకాల కోటీశ్వరులు, అధికారులు ఉండవచ్చు. వారిని పట్టుకోము కనుక చిన్నవారిని పట్టుకుంటామని అంటున్నారు. అది చాలా తప్పుడు పద్ధతి.
- ఎవరు ల్యాండు గ్రాబరు? ఎవరైతే చిన్నవాడిని అడ్డంపెట్టుకుని అమ్ముకున్నాడో, లక్షల రూపాయలు సంపాదించుకున్నారో అటువంటి వారు ఎవరో మీకు తెలుసు. ఈ రకంగా ప్రభుత్వ భూములను వ్యాపారం చేసిన వారిని పట్టుకోండి. అది ఒకరి తరువాత మరొకరు మార్చుకున్నా అసలు వాడిని పట్టుకోకుండా వాడి ఆస్తిని, డబ్బును పట్టుకోకుండా ఎవరి స్వాధీనంలో ఉంటే వారికి శిక్ష వేస్తామంటే ఎలాగా? గవర్నమెంటు ఇళ్ల స్థలాలు ఎలాట్ చేయకపోతే పేదవారినందరినీ పోగుచేసి ప్రభుత్వ భూములను ఆక్రమించండి, అది మీ హక్కు, నివశించడానికి గుడిసె వేసుకుంటే ల్యాండు గ్రాబర్సు కాదు అని చెప్పండి. ఈ బిల్లు వారికి వ్యతిరేకంగా ఉండకూడదని మనవి చేస్తున్నాను.
- రెండవ సవరణ ఏమిటంటే ల్యాండు గ్రాబింగు జరిగింది. కోటీశ్వరులు అయినారు. వారి చేతులలో ఈ భూమి లేదు. అమ్ముకున్నారు. కొనుక్కున్నవారు గుడిసెలు వేసుకుని ఉన్నారు. ఒక చిన్న ఉద్యోగి, చిన్న వర్తకుడు 100 గజాలు కొనుక్కుంటాడు. చౌకగా వస్తుందని ఆశతో కొంటారు. 250 స్క్వేర్ మీటర్లు కొనుక్కుని చిన్న బిజినెస్ పెట్టుకుంటే ఈనాడు ఆ ఇల్లు, స్థలం, ఆ బిజినెస్ అంతా కలిసి లక్ష రూపాయలకన్నా మించకుండా వుండే మినహాయింపు ఇవ్వండి. 250 మీటర్లు కాకపోతే 200 గజాలు అని పెట్టండి.
- అసలు భూమిని అడ్డంపెట్టుకుని, రూ.కోట్లు సంపాదించుకుని అధికారం ఉండి ఎమ్మెల్యేలను కొనేస్తారు. జడ్జిలను కొనేస్తారు. ఆఫీసర్లను కొనేస్తారు. వాళ్లను పట్టుకోండి. అటువంటి వారిని పట్టుకోవడం చేతకాకపోతే మాకు చేతకాదు అని చెప్పండి తప్ప నాకు దొరికినవాడు వీడు అని చెప్పేది మాత్రం తప్పు. అందుచేత నేను చెప్పేది ఏమిటంటే మీరు బీదలను పనిష్ చేయడం కాకుండా ఈ కోటీశ్వరులను పనిష్ చేసి వారి భూములను లాక్కొని చేస్తే ఇది అమలులోకి వస్తుంది.

అంతర్జాతీయం

చిన్న దేశం-పెద్ద సందేశం

ఉరుగ్వేలో మరోసారి వామపక్షాల జయకేతనం



యమండు ఆర్సి, కరోలినా కోసె

ఈ ఏడాది ప్రపంచంలో జరిగిన అనేక ఎన్నికలలో అధికారంలో ఉన్న పార్టీలు ఎక్కువ చోట్ల ఓడిపోయాయి. మితవాద ఫాసిస్టు శక్తులు ముందుకు వచ్చాయి. అయితే ఉరుగ్వేలో మితవాదులను ఓడించి జనం వామపక్షానికి పట్టం కట్టారు. గత పాతిక సంవత్సరాలలో ఏ రాజకీయ పక్షం కూడా పది లక్షల ఓట్ల మార్కును దాటలేదు. తొలిసారిగా వామపక్షం ఆ ఘనతను సాధించింది. ఈ కూటమి ఇప్పటికి ఆరుసార్లు ఎన్నికల్లో పోటీ చేసింది. నాలుగు సార్లు అధికారానికి వచ్చింది. గతంలో గెలవని ప్రాంతాలు, నియోజక వర్గాలలో ఈసారి తన పలుకుబడిని పెంచుకుంది. పందొమ్మిది ప్రాంతాలలో (మన జిల్లాల వంటివి) పన్నెండు చోట్ల ప్రథమ స్థానంలో ఉంది. అన్ని చోట్లా దిగువ సభలో ప్రాతినిధ్యం పొందింది.

లాటిన్ అమెరికాలోని ఉరుగ్వే అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికల్లో అక్కడి వామపక్ష కూటమి 'విశాల వేదిక' (బ్రాడ్ ఫ్రంట్) మరోసారి విజయం సాధించింది. గతంలో 2005 నుంచి 2020 వరకు అధికారంలో ఉన్న ఈ కూటమి ఐదు సంవత్సరాల క్రితం మితవాద శక్తుల చేతిలో ఓటమి పాలైంది. ఈ సారి తిరిగి అధికారానికి వచ్చింది. అక్టోబరు 27న జరిగిన ఎన్నికల్లో నిబంధనల ప్రకారం 50 శాతం పైగా ఓట్లు ఏ అభ్యర్థికీ రాకపోవటంతో తొలి రెండు స్థానాల్లో ఉన్న వారి మధ్య నవంబరు 24న తుది ఎన్నిక జరిగింది. విశాల వేదిక కూటమి అభ్యర్థి, గతంలో చరిత్ర అధ్యాపకుడిగా, మేయర్‌గా పనిచేసిన యమండు ఆర్సి (57) 52.08 శాతం ఓట్లతో గెలిచారు. తొలి రౌండులో 46.12 శాతం తెచ్చుకున్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో దిగువ సభ ఛాంబర్‌లో 99 డిప్యూటీల స్థానాలకుగాను ఆర్సి నాయకత్వంలోని కూటమికి 48, ఎగువ సభ సెనెట్‌లోని 30 సీట్లకు గాను 16 వచ్చాయి. తొలి రౌండులో ప్రత్యర్థులుగా ఉన్న రెండు మితవాద పార్టీల అభ్యర్థులు ఇద్దరికీ కలిపినా 45.09 శాతమే రావటంతో తుది పోరులో వామపక్ష అభ్యర్థి విజయం ఖాయంగా కనిపించినప్పటికీ పోటీ తీవ్రంగా మారింది. మీడియా, ఇతర శక్తులు వామపక్ష వ్యతిరేకతను ఎంతగా రెచ్చగొట్టినప్పటికీ విశాల వేదిక విజయాన్ని అడ్డుకోలేకపోయాయి. నూతన ప్రభుత్వం 2025 మార్చి ఒకటవ తేదీన కొలువు తీరనుంది.



ఎం. కోటేశ్వరరావు

ఉరుగ్వే నిబంధనల ప్రకారం పార్లమెంటు ఎన్నికలు దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో జరుగుతాయి. పార్లమెంటు ఎన్నికల్లో విశాల వేదిక కూటమికి 43.94 శాతం ఓట్లు వచ్చాయి. రద్దయిన సభలో ఉన్న సీట్లతో పోల్చితే దిగువ సభలో 42 నుంచి 48కి, ఎగువ సభలో 13 నుంచి 16కు పెరిగాయి. అధ్యక్ష పదవికి వేసిన ఓటునే ఉపాధ్యక్ష పదవి అభ్యర్థికి కూడా వర్తింపచేస్తారు. ఆ విధంగా కరోలినా కోసె ఎన్నికయ్యారు. పార్లమెంటు దిగువ సభలో ఫ్రంట్‌కు వచ్చిన 48 సీట్లలో కమ్యూనిస్టు పార్టీకి ఐదు, సెనెట్‌లోని 16 సీట్లలో రెండు వచ్చాయి.

చిన్న దేశమైనప్పటికీ ఉరుగ్వే ప్రపంచానికి పెద్ద సందేశమిచ్చిందనే చెప్పవచ్చు. ఈ ఏడాది ప్రపంచంలో జరిగిన అనేక ఎన్నికలలో అధికారంలో ఉన్న పార్టీలు ఎక్కువ చోట్ల ఓడిపోయాయి. మితవాద ఫాసిస్టు శక్తులు ముందుకు వచ్చాయి. అయితే ఇక్కడ మితవాదులను ఓడించి జనం వామపక్షానికి పట్టం కట్టారు. గత పాతిక సంవత్సరాలలో ఏ రాజకీయ పక్షం కూడా పది లక్షల ఓట్ల మార్కును దాటలేదు. తొలిసారిగా వామపక్షం ఆ ఘనతను సాధించింది. ఈ కూటమి ఇప్పటికి ఆరుసార్లు ఎన్నికల్లో పోటీ చేసింది. నాలుగు సార్లు అధికారానికి వచ్చింది. గతంలో గెలవని ప్రాంతాలు, నియోజక వర్గాలలో ఈసారి తన పలుకుబడిని పెంచుకుంది. పందొమ్మిది ప్రాంతాలలో (మన జిల్లాల వంటివి) పన్నెండు చోట్ల ప్రథమ స్థానంలో ఉంది. అన్ని చోట్లా దిగువ సభలో ప్రాతినిధ్యం పొందింది. ఈ ఎన్నికల సందర్భంగానే రెండు రాజ్యాంగబద్ధమైన ప్రజాభిప్రాయ సేకరణకు కూడా ఓటింగ్ జరిగింది. లాటిన్ అమెరికాలో అధికారానికి వచ్చిన చోట్ల అధ్యక్ష పదవులు పొందినప్పటికీ పార్లమెంటులో మెజారిటీ లేని కారణంగా అనేక ఆటంకాలను ఎదుర్కొంటున్నాయి. అయితే ఉరుగ్వేలో ఎగువ సభలో మెజారిటీ ఉంది. దిగువ సభలో 99కి గాను 48 ఉన్నాయి.

మొత్తం లాటిన్ అమెరికా వామపక్షాలు ఎదుర్కొంటున్న సమస్యలనే ఉరుగ్వేలోని విశాల వేదిక కూడా ఎదుర్కొంటున్నది. గతంలో మూడు సార్లు అధికారానికి వచ్చినప్పటికీ అమల్లో ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులను కొనసాగిస్తూనే కార్మికులు, ఇతర తరగతులకు కొన్ని ఉపశమన, సంక్షేమ చర్యలను అమలు జరిపింది. దాంతో సహజంగానే అసంతృప్తి తలెత్తి గత ఎన్నికల్లో మితవాదులను గెలిపించారు. గత పాలకుల వైఫల్యం తిరిగి వామపక్షాలకు అవకాశమిచ్చింది. అధ్యక్షుడిగా ఎన్నికైన ఆర్సి ఒక పెద్ద జిల్లా గవర్నర్‌గా పనిచేశాడు. రెండవ దఫా ఎన్నికలలో ఓట్ల లెక్కింపు ఇంకా మిగిలి ఉండగానే 49.8 శాతం ఓట్లు పొందిన ఆర్సి విజయం ఖాయంగా తేలటంతో ప్రత్యర్థి అల్వారో డెల్‌గాడో తన ఓటమిని అంగీకరిస్తూ ప్రకటన చేశాడు. దేశంలో వామపక్ష శక్తులు విజయోత్సవాలను ప్రారంభించాయి. విశాల వేదికలో కమ్యూనిస్టు, సోషలిస్టు, క్రిస్టియన్ డెమోక్రాట్లు భాగస్వాములు కాగా ప్రతిపక్ష రిపబ్లికన్ కూటమిలో నాలుగు పార్టీలు ఉన్నాయి. అవన్నీ కూడా మితవాద భావజాలానికి చెందినవే.

లాటిన్ అమెరికాలో ఉన్నంతలో ఉరుగ్వే మెరుగైన స్థితిలో ఉన్నవాటిలో ఒకటి. అయితే పెట్టుబడిదారీ విధానం అనుసరిస్తున్నందున దానికి ఉండే జబ్బులకు కార్మికవర్గం గురవుతున్నది. వామపక్షాల పదిహేనేళ్ల పాలనలో మెరుగ్గా ఉన్నప్పటికీ కరోనా సమయంలో లాక్‌డౌన్‌లు, ఇతర ఆర్థిక సమస్యలను ఆసరా చేసుకొని ప్రతిపక్షం గత ఎన్నికల్లో లబ్ధి పొందింది. జవాబుదారీతనంతో కూడిన స్వేచ్ఛను ఇస్తామని, జనాన్ని తాళం వేసి ఉంచేది లేదని ఓటర్ల ముందుకు వెళ్లింది. గత ఐదు సంవత్సరాలలో ఇరుగు పొరుగు దేశాలలో తలెత్తిన సమస్యల కారణంగా విదేశీ పెట్టుబడులు ఉరుగ్వేకు వచ్చినప్పటికీ అక్కడి ప్రమాణాల ప్రకారం చూస్తే నేరాలు, మాదక ద్రవ్యాల జాఢ్యం సవాలుగా మారింది. భద్రత లేదని జనం భావించారు. నేరగాళ్లను రాత్రిపూట అరెస్టు చేసేందుకు అనుమతించాలంటూ తాజా ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీల కూటమి ప్రజాభిప్రాయ సేకరణకు ప్రతిపాదించిందంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. లాటిన్ అమెరికాలో సురక్షితమైనదిగా ఒకప్పుడు పరిగణించిన ఉరుగ్వేలో ఇప్పుడు సంఘటిత నేరగాళ్ల ముఠాలు రెచ్చిపోతున్నాయి. అందుకే ఎన్నికలకు ముందు జరిగిన సర్వేలలో 47 శాతం మంది అభద్రత ప్రధాన సమస్యగా ఉందని చెప్పగా 18 శాతం ఉపాధి, 12 శాతం ద్రవ్యోల్బణం గురించి చెప్పారు. జీవన వ్యయం, ఆర్థిక అసమానతల పెరుగుదల వంటి సమస్యలను ఉరుగ్వే ఎదుర్కొంటున్నది. మితవాద ప్రభుత్వం 2030 నుంచి ఉద్యోగ విరమణ వయస్సును 65 సంవత్సరాలకు పెంచుతామని చెప్పగా విశాల వేదిక 60 ఏళ్లుగా ప్రతిపాదించింది. పిల్లల్లో దారిద్ర్యరేటు 25 శాతం ఉంది. ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయి. తమకు అధికారమిస్తే వామపక్ష నూతన మార్గంలో జనానికి సంక్షేమ విధానాలను, వ్యవసాయానికి పన్ను రాయితీలు ఇస్తామని ఆర్సి వాగ్దానం చేశాడు. గత వామపక్ష ప్రభుత్వాల పాలనలో అబార్షన్లను చట్టబద్ధం కావించారు. స్వలింగ వివాహాలను అనుమతించారు. గత పది సంవత్సరాలుగా ఆర్థిక వ్యవస్థ పురోగతిలో పెద్ద మార్పు లేకపోగా ఈడికగా సాగుతున్నది. ధనికుల గురించి గాక తమ గురించి విశాల వేదిక శ్రద్ధ చూపుతుందనే ఆశాభావాన్ని కార్మికవర్గం వ్యక్తం చేసిందనటానికి ఈ విజయం ఒక సూచిక అని చెప్పవచ్చు. దాన్ని ఏ విధంగా నిలబెట్టుకుంటారనేది కొత్త ప్రభుత్వం ముందున్న ప్రధాన సవాలు. దేశ ఆర్థిక లోటును తగ్గించేందుకు నూతన ప్రభుత్వం ఏం చేయనుందనే ప్రశ్నలను పరిశీలకులు సంధిస్తున్నారు. బలమైన ప్రభుత్వ పాత్ర ఉండాలని వామపక్ష వేదిక చెబుతున్నది. ధనికులపై పన్ను మొత్తాన్ని పెంచకుండా ఇది ఎలా సాధ్యమన్నది ప్రశ్న. అయితే ఈ అంశం గురించి ఎన్నికల ప్రచారంలో ఆర్సి స్పష్టత ఇవ్వలేదు. ఆర్థిక వృద్ధి ద్వారా అదనపు రాబడిని సాధిస్తామని చెప్పాడు. వామపక్ష ప్రభుత్వాల పట్ల అమెరికా వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న పూర్వ రంగంలో ఉరుగ్వే-చైనా సంబంధాలు ఎలా ప్రభావితం అయ్యేది చూడాల్సి ఉంది. చైనాకు ఎగుమతులపై ఉరుగ్వే ఎక్కువగా ఆధారపడి ఉంది.

మహారాష్ట్రలో ఎన్నికల 'సిత్రాలు'

- **పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లే ఎక్కువ**

ముంబయి : మహారాష్ట్ర శాసనసభకు ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ లెక్కించిన ఓట్లకు, పోలైన ఓట్లకు మధ్య తేడా కన్పించింది. ఎన్నికల కమిషన్ అందించిన సమాచారం ప్రకారం మహారాష్ట్ర ఎన్నికల్లో 66.05 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే ఈ లెక్కన 6,40,88,195 ఓట్లు పోలయ్యాయన్న మాట. వీటిలో పురుషులు వేసినవి 3,06,49,318 ఓట్లు కాగా మహిళల ఓట్లు 3,34,37,057, ఇతరుల ఓట్లు 1,820 ఉన్నాయి. అయితే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కలిపి లెక్కించిన ఓట్లు 6,45,92,508. అంటే పోలైన ఓట్ల కంటే 5,04,313 ఓట్లను అదనంగా లెక్కించారు. ఇదెలా సాధ్యం?

రాష్ట్రంలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు తక్కువగా ఉన్నాయి. మిగిలిన 280 స్థానాల్లోనూ పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లే అధికం. అష్టి స్థానంలో జరిగిన లెక్కింపులో భారీ వ్యత్యాసం కన్పించింది. అక్కడ పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు 4,538 ఎక్కువ వచ్చాయి. ఉస్మానాబాద్ స్థానంలో ఈ వ్యత్యాసం 4,155 ఓట్లు.

లోక్‌సభ ఎన్నికల సమయంలోనే...

మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఈ తేడాలు కన్పించాయి. పోలైన ఓట్లకు, ఫారం 17సి లోని సమాచారానికి మధ్య వ్యత్యాసం ఉంది. 17సి పత్రంలో ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పోలైన ఓట్ల సంఖ్యను నమోదు చేస్తారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ ప్రతి దశలోనూ ఓటింగ్ ముగిసిన 48 గంటల్లోగా పోలింగ్ కేంద్రాల వారీగా పడిన ఓట్ల వివరాలను విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించింది. ప్రాథమిక, తుది పోలింగ్ వివరాల మధ్య 5-6 శాతం వ్యత్యాసం కన్పిస్తోందని తెలిపింది. అయితే ఎడిఆర్ అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు.

అలా చేస్తే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతాయని చెప్పింది. ఫారం 17సి లోని సమాచారాన్ని అభ్యర్థుల ఏజెంట్లకు మాత్రమే అందజేస్తామని తప్పించి ఆ వివరాలు ప్రజలకు బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని ఎన్నికల కమిషన్ చెబుతోంది.

ఇవి ఉదాహరణలు మాత్రమే

షెడ్యూల్ తెగలకు కేటాయించిన నవాపూర్ స్థానాన్నే ఉదాహరణగా తీసుకుంటే అక్కడ పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు అధికంగా ఉన్నాయి. ఆ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,95,786. అక్కడ 81.15 శాతం అంటే 2,40,022 ఓట్లు పోలయ్యాయి. అయితే లెక్కించిన ఓట్లు మాత్రం 2,41,193. అంటే పోలైన ఓట్ల కంటే 1,171 అదనం. ఇక్కడ గెలుపొందిన అభ్యర్థి మెజారిటీ 1,122 ఓట్లు. మరో ఉదాహరణ చూద్దాం. మావల్ స్థానంలో పోలైన ఓట్ల కంటే తక్కువ లెక్కించారు. ఈ నియోజకవర్గంలో 2,80,319 ఓట్లు పోలయ్యాయి. అయితే 2,79,081 ఓట్లను మాత్రమే లెక్కించారు. అంటే పోలైన ఓట్ల కంటే 1.238 ఓట్లను తక్కువగా లెక్కించారన్న మాట. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత చాలా ముఖ్యమని, ఎన్నికల సంఘం దీనిపై మరింత దృష్టి సారించాలని నిపుణులు కోరుతున్నారు.

తొలగని మహా ప్రతిష్టంభన

- **1న కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం?**

న్యూఢిల్లీ / ముంబయి : మహారాష్ట్రలో ముఖ్యమంత్రి విషయంలో ప్రతిష్టంభన ఇంకా కొనసాగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం డిసెంబర్ 1న కొత్త ప్రభుత్వం కొలువుదీరే అవకాశముంది. ఆ రోజే నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేస్తారు. అయితే సిఎం ఎవరనే విషయమే ఇప్పుడు తేలాల్సివుంది. అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్‌సిపి (అజిత్ పవార్) గ్రూపు నేత అజిత్ పవార్ ముగ్గురు నేతలూ పోటీలో ఉండటంతో వీరి మధ్య తెగడం లేదు. అయితే బిజెపి అధినాయకత్వం ప్రత్యేక ప్రతినిధిని ముంబయికి పంపి వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం..కొత్త ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రులు, 20 మంది క్యాబినెట్ మంత్రులు కూడా వచ్చే డిసెంబరు 1న ప్రమాణస్వీకారం చేయనున్నారు. 10 మంది బిజెపి ఎమ్మెల్యేలకు, ఆరుగురు షిండే సేన ఎమ్మెల్యేలు, నలుగురు అజిత్ పవార్ నేతృత్వ ఎన్‌సిపి ఎమ్మెల్యేలకు క్యాబినెట్ పదవులు ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి పదవిపై కొన్ని గంటల్లోనే స్పష్టత వస్తుందని శివసేన నాయకుడు సంజయ్ షిర్‌సత్ మంగళవారం సాయంత్రం చెప్పారు. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఇతర బిజెపి సీనియర్ నాయకులను సంప్రదించిన తర్వాత ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్, ఫడ్నవీస్ సమావేశమై ముఖ్యమంత్రి అభ్యర్థిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కాగా ముఖ్యమంత్రి ప్రకటించే విషయంలో తొందరపాటు ప్రదర్శించరాదని బిజెపి భావిస్తోంది.

అవి బిజెపి సబ్ కంపెనీలు : శివసేన (యుబిటి) వ్యంగ్యాస్త్రాలు

తాజా పరిణామాలపై ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యుబిటి) వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఆ పార్టీ ఎంపి సంజయ్ రౌత్ ముంబయిలో విలేకరులతో మాట్లాడుతూ 'బిజెపికి భాగస్వామ్య పక్షాలుగా ఉండడంతో షిండే సేన, అజిత్ ఎన్‌సిపి పార్టీలు ముఖ్యమంత్రిని తేల్చుకోలేకపోతున్నాయి. అవి బిజెపికి సబ్-కంపెనీలుగా మారిపోయాయి. ముఖ్యమంత్రిని అమిత్ షా, నరేంద్ర మోడీ నిర్ణయిస్తారు. షిండే, అజిత్ పవార్ స్వీయ నిర్ణయాలు తీసుకోలేరు. ఈ రెండు పార్టీలు అమిత్ షా, మోడీలకు బానిసలు' అని విమర్శించారు. మహారాష్ట్ర ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ ముఖ్యమంత్రిని నిర్ణయించడంలో జాప్యం జరగడం అనవసరమని పిసిసి అధ్యక్షులు నానా పటోలే చెప్పారు.

50రోజులుగా
సైన్యం దిగ్బంధనంలో ఉత్తర గాజా !

- **ఆహారం, నీరు లేకుండా లక్షలాదిమంది చిన్నారులు**



గాజా : ఉత్తర గాజాను ఇజ్రాయిల్‌సైన్యం గత 50రోజులుగా నిర్బంధించింది. అక్టోబరు 6న మొదలైన ఈ దిగ్బంధనం, దాడులతో అక్కడ గల ప్రజలకు ఆహారం, నీరు, వైద్య సాయం అందడం లేదు. సహాయక సిబ్బందితో సహా ఎవరికీ ఈ ప్రాంతంలోకి వెళ్లడానికి కుదరడం లేదు. కరువు నెలకొనే పరిస్థితి వుందని హెచ్చరికలు జారీ చేసినా సరఫరాలను లోపలకు పంపడానికి సైన్యం అనుమతించడం లేదు. దాదాపు 1,30,000మంది చిన్నారులు ఈ ప్రాంతంలో చిక్కుకున్నారని సేవ్ ది చిల్డ్రన్ సంస్థ అంచనా వేస్తోంది. ఆ ఏరియా అంతా మిలటరీ జోన్‌గా ఇజ్రాయిల్ రక్షణ బలగాలు ప్రకటించాయి. కనీస మానవత్వం చూపకుండా వ్యవహరిస్తున్నారంటూ ఐక్యరాజ్య సమితి విమర్శించినా ఇజ్రాయిల్ పట్టించుకోవడం లేదు. ఉత్తర గాజా గవర్నరేట్ ఏరియా మొత్తం ముప్పు ముంగిట వుందని ఐక్యరాజ్య సమితి ఇప్పటికే పలు హెచ్చరికలు జారీ చేసింది. కానీ ఏ సహాయ గ్రూపులను సైన్యం లోపలకు అనుమతించడం లేదు.

సేవ్ ది చిల్డ్రన్‌కి చెందిన సంస్థలో పనిచేస్తున్న ఒక మహిళ తన భయానక అనుభవాన్ని వెల్లడిస్తూ, నిరంతరం బాంబు మోతలతో దద్దరిల్లుతున్న ఈ ప్రాంతంలో పిల్లలతో సహా చిక్కుకుపోయామని, ఎక్కడికైనా పారిపోయేందుకు కూడా వీల్లేకుండా వుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబం మొత్తంగా చిన్నాభిన్నమైపోయిందన్నారు. ఆహారం లేదు, పరిశుభ్రమైన నీరు లేదు, నిరంతరంగా భయాందోళనల కారణంగా తన పిల్లలకు మానసిక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, శరీరంపై దద్దుర్లు వచ్చి, నెత్తురోడుతున్నారని ఆమె వాపోయారు. అయినా మందులు లేవు, సాయం లేదని చెప్పారు. 5వేల కుటుంబాలకు సరిపడా ఆహార కిట్‌లు, గత ఏడు వారాలుగా ఈ ఏరియాకు బయటే పడి వున్నాయని ఆమె చెప్పారు. చిన్నారుల ఆహారం కొరత చాలా తీవ్రంగా వుందన్నారు. అంతర్జాతీయ సమాజం చేసే విజ్ఞప్తులన పెడ చెవిన పెట్టిన ఇజ్రాయిల్‌చిన్నారుల విషయంలో అమానుషంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

విశాఖ-కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లో విశాఖపట్నం - కిరండూల్ - విశాఖపట్నం మధ్య నడిచే కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జోడించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 08551 విశాఖపట్నం - కిరండూల్ రైలుకు డిసెంబర్ 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27 తేదీల్లోనూ, 08552 కిరండూల్ - విశాఖపట్నం రైలుకు డిసెంబర్ 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లోనూ అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జత చేయనున్నారు.

అలజడిగానే వాతావరణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

దక్షిణ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు హిందూ సముద్రం మధ్య కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా మారడంతో ఆ ప్రభావం వాతావరణ పరిస్థితులపై పడింది. మంగళవారమంతా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో చల్లని గాలులు వీచాయి. తీరంలో అలలు ఎగిసిపడ్డాయి. కోస్తాకు, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు వర్ష సూచన ఉండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విషయం తెలిసిందే.

తిరుపతిలో ఆరు లైన్ల రహదారి

- **17 కి.మీ వరకూ భారీ ఫ్లైఓవర్**

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి గరుడ వారధి తరువాత మరో పెద్ద ఫ్లై ఓవర్ నగర సరిహద్దుల్లో రానుంది. సి.మల్లవరం నుంచి తూకివాకం వరకూ 17 కిలోమీటర్ల వరకూ భారీ ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ఈనెల 5వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజాప్రయోజనాల రీత్యా రహదారుల చట్టం కింద 1956 ప్రకారం ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీన్ని నేషనల్ హైవే 71గా నామకరణం చేశారు. చిత్తూరు -నాయుడుపేట ఆరు లైన్ల రహదారిగా రూపుదిద్దుకుంటోంది. సి.మల్లవరం వద్ద ఈ నిర్మాణం ఆగిపోయింది. సదరు కాంట్రాక్టర్ ల్యాండ్ అక్విడేషన్ చేయలేదని పనులను ప్రారంభించలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి నిర్మాణానికి కాంట్రాక్టర్ ఓకే చేశారు. 97.100 కిలోమీటర్ల వరకూ ఈ రహదారి నిర్మాణం మల్లవరం వరకూ ఆగి ఉంది. 114.500 దూరం నిర్మిస్తే తూకివాకం వరకూ 17 కిలోమీటర్ల దూరం ఫ్లైఓవర్ నిర్మాణం ఏడాదిలోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్లు సమాచారం. మల్లవరం దగ్గర నుంచి తిరుచానూరు ఫ్లైఓవర్‌లో కలుస్తుంది. వకుళమాత టెంపుల్, ఉప్పరపల్లి చెక్‌పోస్టు, అగ్రహారం సర్కిల్, తనపల్లి క్రాస్ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం అండర్‌బ్రిడ్జిగా సాగనుంది. ఫైఓవర్‌కు కుడి, ఎడమ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డు ఏర్పాటు కానుంది. ఇప్పటికే నేషనల్ అథారిటీ వారు హద్దు రాళ్లను నాటి, జెసిబిలతో తవ్వకాలు చేపట్టారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే సి.మల్లవరం వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేసి వాహనదారుల వద్ద నుంచి 'టోల్' వసూలు చేసే అవకాశం ఉంది.

అర్హులైన పేదలకు ఇళ్లు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఎన్‌టిఆర్ ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మండలంలోని నిమ్మాడలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బి, హౌసింగ్, నీటిపారుదల శాఖ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల కోసం అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2014- 2019 కాలంలో ఇళ్లు మంజూరై ఆన్‌లైన్‌లో అర్హుల జాబితా లేని వాటినీ గుర్తించి పరిష్కరించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. టెక్కలిలో అన్ని వసతులతో కూడిన ఆదర్శ కాలనీ నిర్మాణానికి సంకల్పించామన్నారు. టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ప్రతి రైతుకి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలని వాటికి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతం నియోజవర్గంలో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. 52 పనులకు గానూ రూ.ఐదు కోట్లతో పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. రహదారి నిర్మాణంతో పాటు మరమ్మతులూ చేపడుతున్నామన్నారు. కొన్ని పనులకు సంబంధించి శంకుస్థాపన చేయాల్సింది ఉందని తెలిపారు. నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని మంత్రి తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ, నీటిపారుదల, పంచాయతీరాజ్ డిఇ, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

'హాయ్ నాన్న'కు అవార్డుల పంట



నేచురల్ స్టార్ నాని, మృణాల్‌ఠాకూర్, కియారా ఖన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్‌హిట్ మూవీ 'హాయ్ నాన్న'. గతేడాది థియేటర్లలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్‌గా నిలిచింది. శౌర్యువ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా 'సలార్' పోటీని తట్టుకుని ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా మెక్సిలో జరిగిన ఐఎఫ్ఎసి ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏకంగా ఆరు అవార్డులను సొంతం చేసుకుంది. బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ స్కోర్, బెస్ట్ రైటర్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ సెట్ డిజైన్, బెస్ట్ హెయిర్ అండ్ మేకప్ ఫీచర్ సౌండ్, బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ సౌండ్ విభాగాల్లో అవార్డులను దక్కించు కుంది. తండ్రీ కూతుళ్ల ఎమోషనల్ చిత్రంగా 'హాయ్ నాన్న' సినిమా తెరకెక్కించారు. గతంలో న్యూయార్క్‌లో జరిగిన 'ది ఓనిరోస్ ఫిల్మ్ అవార్డు'ల్లోనూ సత్తా చాటింది. పలు విభాగాల్లో మొత్తం 11 అవార్డులను కైవసం చేసుకుంది. ఏథెన్స్ ఇంటర్నేషనల్ ఆర్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మార్చ్-2024 ఎడిషన్‌లో బెస్ట్ ఫీచర్ ఫిల్మింగ్ అవార్డును కైవసం చేసుకుంది.

డిసెంబర్ 14న 'ఫియర్' విడుదల



నటి వేదిక ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఫియర్'. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ప్రొడ్యూసర్ డాక్టర్ వంకి పెంచలయ్య, ఎఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాతరెడ్డి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డాక్టర్ హరిత గోగినేని ఈ సినిమా రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా వివిధ అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్‌లో 70కిపైగా అవార్డులను గెల్చుకుని సరికొత్త రికార్డును సృష్టించింది. డిసెంబర్ 14న సినిమాను విడుదల చేస్తామని మేకర్లు మంగళవారంనాడు ప్రకటించారు. ఇప్పటికే హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో టీజర్ విడుదల చేయగా సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్ అయ్యింది. జయప్రకాష్ (జెపి), పవిత్ర లోకేష్, అనీష్ కురువిల్ల, సాయాజిషిండే, సత్యకృష్ణ, సాహిత దాసరి, షాని తదితరులు నటిస్తున్నారు.

గీత రచయిత కులశేఖర్ మృతి



విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ సినీ గీత రచయిత కులశేఖర్ (53) మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. పాటల రచయితగా ఆయన టాలీవుడ్‌లో మంచి గుర్తింపును పొందారు. ఆ తర్వాత అవకాశాలు తగ్గిపోవటం, అనంతరం అనారోగ్య కారణాలతో మానసికంగా కృంగిపోయారు. హైదరాబాద్‌లో తొలుత జర్నలిస్టుగా చేరారు. ఆ తర్వాత సినీ గీత రచయితగా పనిచేశారు. చిత్రం, ఔనన్నా కాదన్నా, ఘర్షణ, భద్ర, నువ్వు నేను, సంతోషం,జయం, సైనికుడు లాంటి మంచి సినిమాలకు పాటలు రాశారు. కులశేఖర్ మృతికి పలువురు టాలీవుడ్ ప్రతినిధులు తీవ్ర సంతాపం తెలిపారు.

వెరైటీ టైటిల్ 'అబద్ధమేవ జయతే' : కార్తికేయ

'అబద్ధమేవ జయతే' సినిమా టైటిల్ వెరైటీగా ఉందని నటుడు కార్తికేయ అభినందించారు. సుశాంత్ యష్కీ, ప్రవణ్యారెడ్డి, మాస్టర్ వికాస్, మాస్టర్ భాను, విజయ కృష్ణ, వెంకీ లింగం ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించారు. కె.కార్తికేయన్ సంతోష్ దర్శకత్వం వహించారు. పర్పుల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై కొండా సందీప్, అభిరామ్ అలుగంటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోను కార్తికేయ విడుదల చేసి చిత్ర యూనిట్‌ను అభినందించారు. సరికొత్త కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షిం చారు. చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. గ్రామీణ ప్రాంత నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రంలో 20 ఏళ్ల క్రితం ఉన్న సెట్ ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతుందని మేకర్లు తెలిపారు. మ్యూజిక్ డైరెక్టర్ పవన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. వికాస్ చిక్ బల్లాపూర్ కెమెరామెన్‌గా, షాడో ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. సూరారం, వేములవాడ, వికారాబాద్, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ సినిమాను విడుదల చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నా మని మేకర్లు ప్రకటించారు.



తమిళ్ తలైవాస్ గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్-11



నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-11లో భాగంగా మంగళవారం జరిగిన పోటీలో తమిళ్ తలైవాస్ జట్టు విజయం సాధించింది. తమిళ్ తలైవాస్ జట్టు 40-26పాయింట్ల తేడాతో యుపి యోధాను చిత్తుచేసింది. తమిళ్ జట్టులో మోయిన్(8), నరేంద్ర(6), లక్ష్మణన్(6)రైడ్ పాయింట్లు సాధించగా.. ట్యాకిల్స్‌లో నితీష్‌కుమార్, రోనక్ రాణించారు. ఇక యుపి జట్టులో గగన్(8) రైడ్స్‌లో ఒంటరి పోరాటం చేయగా.. ఆషు సింగ్(5) ట్యాకిల్స్‌లో మెరిసాడు. ఇక తమిళ్ జట్టు ఆరుసార్లు యుపి జట్టును ఆలౌట్ చేయగా.. యుపి జట్టు 2సార్లు తమిళ్ జట్టును ఆలౌట్ చేయగల్గింది. రైడ్‌ల ద్వారా తమిళ్ జట్టు 20పాయింట్లు సాధిస్తే.. యుపి జట్టు కేవలం 13పాయింట్లకే పరిమితమైంది. దబాంగ్ ఢిల్లీ-పట్నా పైరెట్స్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్ 39-39పాయింట్లతో టై అయ్యింది. పట్నా రైడర్ దేవంక్(15) పాయింట్లతో సత్తా చాటగా.. దీపక్(7) ట్యాకిల్స్‌లో మెరిసాడు. ఇక ఢిల్లీ జట్టులో ఆషు మాలిక్(11)రైడ్స్‌లో రాణించాడు. ఇరుజట్లు నాలుగేసిసార్లు ప్రత్యర్థి జట్లను ఆలౌట్ చేశాయి.

ఒకప్పటి స్టార్ ఆటగాళ్లు..

ఈసారి వేలంలో నిరాశే..!



జెడ్డా: 2025 ఐపిఎల్ సీజన్‌కు వేలం ముగిసింది. సౌదీ అరేబియాలోని జెడ్డాలో రెండ్రోజులపాటు జరిగిన వేలంలో 577 ఆటగాళ్లు నిలిచారు. వీరిలో 377మంది భారత ఆటగాళ్లు ఉండగా.. 210మంది విదేశీ ఆటగాళ్లు. 10 ఫ్రాంచైజీలు కలిపి కేవలం 182మంది ఆటగాళ్లను మాత్రమే కొనుగోలు చేశాయి. ఇక రూ.2కోట్ల కనీస ధరతో వేలం బరిలో నిలిచిన రిషబ్ పంత్ ఈసారి జరిగిన వేలంలో రికార్డు ధర పలికాడు. అతడ్ని లక్నో సూపర్‌జెయింట్స్ రూ.27కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐపిఎల్ చరిత్రలో రికార్డు ధర పలికిన ఆటగాడిగా పంత్ నిలిచాడు. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్ రూ.26.75కోట్లతో రెండో అత్యధిక పలికిన ఆటగాడిగా నిలిచాడు. అతడ్ని పంజాబ్ కింగ్స్ కైసవం చేసుకుంది. ఈసారి వేలంలో 395మంది ఆటగాళ్లను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. వీరిలో చాలామంది మేటి క్రికెటర్లు ఉన్నారు. బ్యాటర్ల జాబితాలో డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్, సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా, దేవదత్ పడిక్కల్, మయాంక్ అగర్వాల్ ఉండగా.. వీరు గతంలో తమ ఫ్రాంచైజీలకు ఒంటిచేత్తో విజయాలను అందించినవారు. కానీ ఈసారి మాత్రం ఏ ఫ్రాంచైజీ వారిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. అన్ని ఫ్రాంచైజీలు యువ క్రికెటర్ల కొనుగోలుకు అధిక ప్రాముఖ్యత ఇవ్వడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.

అమ్ముడుపోని ఆటగాళ్లలో కొందరు...

బ్యాటర్లు: వార్నర్, అన్‌మోల్‌ప్రీత్ సింగ్, యశ్ దుల్, కేన్ విలియమ్సన్, మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్, పడిక్కల్, మాధవ్ కౌశిక్, పుక్‌రాజ్ మాన్, ఫిన్ అలెన్, డీవాల్డ్ బ్రెవిస్, బెన్ డకెట్, బ్రాండన్ కింగ్, పాథుమ్ నిస్సంక, స్టీవ్ స్మిత్, సచిన్ దాస్, సల్మాన్ నజర్, లూయిస్ డూ ప్లోయ్, శివాలిక్ శర్మ.

బౌలర్లు: పీయూష్ చావ్లా, ముస్తాఫిజుర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, కార్తిక్ త్యాగి, ముజీబ్ ఉర్ రెహ్మాన్, వకార్ సలామ్‌కేలీ, విజయకాంత్ వియాస్‌కాంత్, అకీల్ హుసేన్, అదిల్ రషీద్, కేశవ్ మహారాజ్, సకీబ్ హుస్సేన్, విద్వాత్ కావేరప్ప, రాజన్ కుమార్, ప్రశాంత్ సోలంకి, జాతవేద్ సుబ్రమణియన్, నవీన్ ఉల్ హక్, ఉమేశ్ యాదవ్, రిషాద్ హుస్సేన్, రాఘవ గోయల్, యశ్వంత్, రిచర్డ్ గ్లీసన్, అల్జారీ జోసెఫ్, లూక్ వుడ్, అర్పిత్ గులేరియా, జేసన్ బెహరెండాఫ్, శివం మావి, నవదీప్ సైనీ, దివేశ్ శర్మన్, దిల్షాన్ మధుశంక, ఆడమ్ మిల్నే, రూర్కీ, లాన్స్ మోరిస్, ఓలీ స్టోన్, కైల్ జేమీసన్, క్రిస్ జోర్డాన్.

ఆల్‌రౌండర్లు: శార్దూల్ ఠాకూర్, ఉత్కర్ష్ సింగ్, డారిల్ మిచెల్, రిషి ధావన్, శివం సింగ్, అట్కిన్‌సన్, సికందర్ రాజా, కైల్ మేయర్స్, మాథ్యూ షార్ట్, మైకేల్ బ్రేస్‌వెల్, అబ్దుల్ బాసిత్, ప్రిటోరియస్, రోస్టన్ చేజ్, నాతన్ స్మిత్, సంజయ్ యాదవ్, ఉమంగ్ కుమార్, దిగ్విజయ్ దేశ్‌ముక్.

వికెట్ కీపర్లు: బెయిర్‌స్టో, ఉపేంద్ర యాదవ్, శాయ్ హోప్, కేఎస్ భరత్, అలెక్స్ కేరీ, అరావలీ, హర్విక్ దేశాయ్, జోష్ ఫిలిప్, చేతన్, తేజస్వి దహియా.

సయ్యద్ మోడీ బ్యాడ్మింటన్ టోర్నీ
సాత్విక్-చిరాగ్ నిష్క్రమణ

న్యూఢిల్లీ: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నుంచి చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ మంగళవారం వైదొలిగారు. గాయం కోలుకోని కారణంగా ఈ టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ-750లో ఆడి సెమీస్‌కు చేరారు.



కేరళలో నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మిక, కర్షక సంఘాల నాయకులు



పంజాబ్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులు, కార్మికులు

వినాశకర విధానాలపై శ్రమజీవుల పోరుబాట

- దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు, ర్యాలీలు
- మోడీ సర్కార్ తీరుపై కార్మికులు, రైతులు ఆగ్రహం
- నిరసనల్లో పది లక్షల మంది భాగస్వామ్యం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా శ్రమజీవులు పోరుబాట పట్టారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై వివిధ రూపాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన దినంగా ఘనంగా వజ్రోత్సవ వేడుకలు జరుపుతున్నామని చెబుతున్న మోడీ సర్కార్ అదే రాజ్యాంగ స్ఫూర్తికి నీరుగారుస్తోందని కార్మిక, కర్షకలోకం నిరసించింది. దేశానికి వినాశనం తలపెట్టేలా మతోన్మాద విద్వేషాలు రెచ్చగొడుతూ, విజయమాల్యా, నీరవ్‌మోడీ, గౌతమ్ అదానీ వంటి కుంభకోణాల కాలనాగులు వంటి బడా కార్పొరేట్ పెద్దలకు మోడీ సర్కార్ కొమ్ముకాస్తోందని, ప్రభుత్వ సంస్థలను, దేశ వనరులను కారుచౌకగా కట్టబెట్టి దేశ ప్రగతిలో భాగస్వాములైన శ్రమజీవులపై అణిచివేత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక చేపట్టిన సార్వత్రిక సమ్మె, అలాగే సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన చారిత్రాత్మక 'చలో ఢిల్లీ' ఉద్యమానికి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో దాదాపు పది లక్షల మంది కార్మికులు, రైతులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక, ఎస్‌కెఎం, రంగాలవారీ పౌర సమాఖ్యలు, సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు, ప్రదర్శనలు, సభలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో ఐదు వందల ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు విజయవంతంగా చేపట్టారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ, పారిశ్రామిక ప్రాంతాల్లోనూ సామూహిక నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ ఆందోళనలకు సంఘీభావంగా పలు కార్యాలయాల వద్ద లంచ్ అవర్ ర్యాలీలు నిర్వహించారు. నిత్యావసర వస్తువుల ధరలు అనూహ్యంగా పెరగడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్మిక, కర్షకలపై లాఠీచార్జ్

బిజెపి, దాని భాగస్వామ్య పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అనేక చోట్ల కార్మిక, కర్షకులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. బీహార్‌లోని భగల్‌పూర్‌లో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, రైతులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. దీంతో ఆరుగురికి గాయాలయ్యాయి. పలువురిని అరెస్టు చేశారు. శ్రమజీవుల ఆందోళనలకు మద్దతుగా అనేక చోట్ల విద్యార్థులు, యువకులు, మహిళలు, ఉపాధ్యాయులు, ఇతర నిపుణులు, కళా, సాంస్కృతిక, సాహిత్య రంగాలకు చెందిన సంఘాలు, బహుజన సంఘాలు ర్యాలీలు నిర్వహించారు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి..

కార్మికులు, రైతులు, ప్రజల ప్రయోజనాల కోసం, దేశ ప్రయోజనాల కోసం తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును శ్రమజీవుల ఆందోళనలకు నేతృత్వం వహించిన సంఘాలు, సమాఖ్యలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు రాష్ట్రపతిని ఉద్దేశించి వినతి పత్రాలను అధికారులకు సంబంధిత వేదికల నాయకులు అందజేశారు.

'ఓటుకు నోటు' కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు మరో నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ఈ కేసు నుంచి తనను తప్పించాలని జెరూసలేం మత్తయ్య గతంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. జెరూసలేం మత్తయ్య పేరును తొలగిస్తూ (క్వాష్) ఇదివరకే తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 2016 జులై 6న తెలంగాణ అవినీతి నిరోధక విభాగం (ఎసిబి) సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ మంగళవారం జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ కెవి విశ్వనాథన్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున తెలంగాణ స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్ కుమార్, ప్రతివాది తరపున ఒఆర్ ప్రియాంక ప్రకాశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాత చేపడతామని ధర్మాసనం పేర్కొంది. కాగా... వచ్చే ఏడాది జనవరి 7న ఈ పిటిషన్ మరోసారి సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చే అవకాశం ఉంది.

'ఇస్కాన్' సన్యాసి చిన్మయి కృష్ణదాస్ అరెస్టు



ఢాకా : వివాదస్పద అధ్యాత్మిక సంస్థ 'ఇస్కాన్'కు చెందిన సన్యాసి చిన్మయి కృష్ణ దాస్ బ్రహ్మాచారిని బంగ్లాదేశ్‌లో అరెస్టు చేశారు. అతను బంగ్లాదేశ్ సనాతన్ జాగరణ్ మంచ్ ప్రతినిధిగా ఉన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయంటూ వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల జరిగిన ఆందోళనల్లో అతను పాల్గొన్నట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా చట్టోగ్రామ్‌లోని కొత్త మార్కెట్ ఏరియాలో బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని కృష్ణదాస్ అవమానించారని ఆరోపిస్తూ అతడితో సహా 19 మందిపై దేశద్రోహం నేరం కింద ఈ ఏడాది అక్టోబరు 30న కేసు నమోదు చేశారు. ఇదే కేసులో సోమవారం ఢాకా విమానాశ్రయంలో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఆ తర్వాత ఢాకా మెట్రోపాలిటన్ పోలీసుల డిటెక్టివ్ బ్రాంచ్ అధికారులు అతణ్ని కస్టడీలోకి తీసుకున్నారు. సోమవారం ఆయనను అదుపులోకి తీసుకున్న వెంటనే ఆయన తరపు న్యాయవాదులు బెయిల్ కోసం దరఖాస్తు చేశారు. కానీ దాన్ని న్యాయస్థానం తిరస్కరించింది. కృష్ణదాస్ అరెస్టును నిరసిస్తూ ఇస్కాన్ తదితర హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఢాకా, చిట్టగాంగ్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో అనేకమంది గాయపడ్డారు. పలుచోట్ల రహదారులను దిగ్బంధించారు.

భారత్ ఆందోళన

కృష్ణదాస్‌ను అరెస్టు చేయడం, బెయిల్‌కు తిరస్కరించిన పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై పలు దాడుల నేపథ్యంలో ఈసంఘటన చోటు చేసుకుందని ఆ ప్రకటన పేర్కొంది. మైనారిటీల ఇళ్ళు, వాణిజ్య సముదాయాలు దగ్ధం చేసిన, లూటీ చేసిన కేసులు కూడా అనేకం వున్నాయని పేర్కొంది. అలాగే ఆలయాలపై, ఆరాధనా స్థలాలపై విధ్వంసానికి పాల్పడడం, విగ్రహాలను దొంగిలించడం వంటి సంఘటనలు కూడా జరిగాయని తెలిపింది. శాంతియుత నిరసనల ద్వారా తమ చట్టబద్ధమైన డిమాండ్ల సాధన కోసం గొంతెత్తిన వారిపై ఇలా అభియోగాలు నమోదు చేయడం దురదృష్టకరమని పేర్కొంది.

అదానీలు నోరు తెరిస్తే అబద్ధాలే !

- స్టాక్ ఎక్స్ఛేంజీలకు తప్పుడు సమాచారం
- మాయమాటలతో ఇన్వెస్టర్లను వంచించిన వైనం



న్యూఢిల్లీ : సౌర విద్యుత్ ప్రాజెక్ట్‌ను దక్కించుకునేందుకు అదానీ సంస్థ కానీ లేదా ప్రమోటర్ గౌతమ్ అదానీ సహా ఆ గ్రూపుతో సంబంధమున్న వ్యక్తులు కానీ భారతీయ అధికారులకు ముడుపులు అందజేశారా? లేదా? అనే విషయంపై అమెరికాలో దర్యాప్తు అధికారులు పరిశీలన జరుపుతున్నారని ఈ ఏడాది మార్చి 15న బ్లూమ్‌బర్గ్ అనే మీడియా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. అయితే ఇందులో నిజం లేదని రెండు రోజుల తర్వాత అదానీ గ్రూప్ కార్పొరేట్ ఫైనాన్స్ విభాగం అధిపతి వివిధ కార్పొరేట్ ఫైనాన్స్ సంస్థలు, పెట్టుబడిదారులకు పంపిన ఇ--మెయిల్ ద్వారా తెలియజేశారు. అదంతా తప్పుడు కథనమని గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ ఆర్ అదానీ కూడా ఆరోపించారు. మరో రెండు రోజుల తర్వాత భారత స్టాక్ ఎక్స్ఛేంజీలకు అదానీ గ్రూప్ ఓ సమాచారం పంపుతూ విచారణ గురించి తనకేమీ తెలియదని బొంకింది. అయితే ఈ వాదనల్లో ఏ మాత్రం వాస్తవం లేదని ఇటీవలి పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తుల్లో టాప్ 5లో చేరిన అదానీ ఆది నుంచి ప్రతి వ్యవహారంలోనూ అబద్ధాలతోనే వంచిస్తూ కేంద్రంలోని పెద్దల సహకారంతో తన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారని వాణిజ్య రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

భిన్న వాదనలు

భారత్‌లో సౌర విద్యుత్ కాంట్రాక్టులు పొందేందుకు గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్‌లోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు అనేక మిలియన్ డాలర్ల ముడుపుల కుంభకోణానికి పాల్పడ్డారని, అమెరికాలోని పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించేందుకు వారు దీనిని వాడుకున్నారని ఆరోపిస్తూ అమెరికా ప్రాసిక్యూటర్లు న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసిన విషయం తెలిసిందే. సాగర్ అదానీపై సంవత్సరం క్రితమే విచారణ ప్రారంభించామని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్స్ (ఎఫ్‌బిఐ) బయటపెట్టింది. విచారణ సంగతే తమకు తెలియదని మన స్టాక్ ఎక్స్ఛేంజీలకు అదానీలు చెప్పిన మాటలకు ఎఫ్‌బీఐ ప్రకటన పూర్తి భిన్నంగా ఉంది. ఈ ఏడాది మార్చి 4న జారీ చేసిన బాండ్ ఆఫర్ డాక్యుమెంట్‌కు సంబంధించి అవినీతి నిరోధక విభాగం దర్యాప్తు జరుపుతోందని అదానీ గ్రీన్ ఎనర్జీ అనుబంధ సంస్థలు సూచనప్రాయంగా చెప్పాయి. ఆ తర్వాత కొద్ది రోజులకే విచారణ విషయం తనకు తెలియదని అదానీలు పచ్చి అబద్ధాలు ఆడారు.

2003లోనే సాగర్ అదానీకి సెర్చ్ వారంట్

బ్లూమ్‌బర్గ్‌లో కథనం ప్రచురితమైన తర్వాత మార్చి 19న అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఇఎల్) బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీకి, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీకి ఇమెయిల్స్ పంపింది. 'బ్లూమ్‌బర్గ్‌లో ప్రచురితమైన ఆరోపణలకు సంబంధించి అమెరికా న్యాయ శాఖ నుండి మాకు ఎలాంటి నోటీసులు రాలేదు' అని వాటిలో తెలిపింది. అమెరికా అవినీతి నిరోధక చట్టాలను 'థర్డ్ పార్టీ' ఉల్లంఘిస్తోందన్న విషయంపై విచారణ జరుగుతోందని మాత్రమే తనకు తెలుసునని చెప్పింది. అయితే గత ఏడాది మార్చి 17న ఎఫ్‌బీఐ ఏజెంట్లు అమెరికాలో సాగర్ అదానీని కలిసి సెర్చ్ వారంట్ అందజేశారు. సాగర్ అదానీకి చెందిన ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయన విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ మరునాడే సాగర్ అదానీపై జారీ చేసిన సెర్చ్ వారంట్‌ను, విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుపుతూ అందించిన నోటీసును గౌతమ్ అదానీ తనకు ఇమెయిల్ ద్వారా పంపుకున్నారు.

దావాల్లోనే స్పష్టం చేశారు

విచారణ విషయం తెలిసినప్పటికీ గౌతమ్ అదానీ, సాగర్ అదానీలు ముడుపుల వ్యవహారాన్ని అమెరికాలోని ఆర్థిక సంస్థలు, పెట్టుబడిదారులకు తెలియజేయలేదని, అంతేకాక తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేశారని అమెరికా ప్రాసిక్యూటర్లు తమ ఛార్జిషీటులో ఆరోపించారు. విచారణలో భాగంగా అమెరికా సెక్యూరిటీలు-ఎక్స్ఛేంజ్ కమిషన్ అదానీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌ల పైన, అజూర్ పవర్ ఇన్వెస్టర్‌కు చెందిన ఎగ్జిక్యుటివ్ పైన రెండు దావాలు వేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ కీలక ఎగ్జిక్యూటివ్‌లు గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, వినీత్ అదానీపై విచారణ జరుగుతోందని వాటిలో స్పష్టంగా తెలియజేశారు.

అంతా పారదర్శకమేనట

తనపై విచారణ జరుగుతున్న విషయం తెలియనే తెలియదని స్టాక్ ఎక్స్ఛేంజీలకు చెప్పిన నెలలోనే బాండ్ ఆఫర్ డాక్యుమెంట్‌కు సంబంధించి తనపై ముడుపుల వ్యతిరేక దర్యాప్తులు సాగుతున్నాయని అదానీ గ్రీన్ ఎనర్జీ అంగీకరించింది. పునరుద్పాదక ఇంధన కాంట్రాక్టులను పారదర్శకంగా, భారత్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన పోటీ టెండర్ ప్రక్రియలోనే పొందానంటూ అదానీ గ్రీన్ తన ఇన్వెస్టర్లను నమ్మించింది. ఈ విధంగా ఇన్వెస్టర్లను మోసం చేయడం, తప్పుదోవ పట్టించడం సెబీ నిబంధనలకు వ్యతిరేకం. కాగా భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తప్పుడు సమాచారం ఇచ్చినందుకు అదానీ గ్రూపుపై సెబీ విచారణ జరిపే అవకాశం ఉన్నదని సమాచారం.



క్యూబాకు బాసటగా నిలబడాలి !

- యురోపియన్ దేశాలతో సంబంధాలు బలోపేతం
- పారిస్‌లో యురోపియన్ సంస్థల సంఘీభావ సమావేశాలు

బ్రస్సెల్స్ : క్యూబాపై అమెరికా ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని యురోపియన్ మూవ్‌మెంట్స్ డిమాండ్ చేశాయి. క్యూబా లక్ష్యంగా సాగిస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించాయి. అమెరికా ఆంక్షలతో, పాల్పడుతున్న తప్పుడు ప్రచారంతో నలిగిపోతున్న నేపథ్యంలో క్యూబాకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ నవంబరు 22-24 తేదీల్లో పారిస్‌లో యురోపియన్ దేశాలకు చెందిన సామాజిక ఉద్యమాలు, వాణిజ్య సంఘాలు, రాజకీయ సంస్థలకు చెందిన 300మందికి పైగా ప్రతినిధులు సమావేశమయ్యారు. 19వ యురోపియన్ కాంటినెంటల్ మీటింగ్ ఆఫ్ సాలిడారిటీ విత్ క్యూబా పేరుతో ఈ సమావేశం జరిగింది.

క్యూబా, యురోపియన్ దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంపై ప్రధానంగా ప్రతినిధులు దృష్టి పెట్టారు. అమెరికా ఆంక్షల వల్ల తలెత్తే ఆర్థిక పర్యవసానాలను పరిష్కరించడంపై, ఈ ఒత్తిళ్లతో రోజువారీ జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను చర్చించారు. క్యూబాపై సాగే తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు యురోపియన్ నెట్‌వర్క్‌లకు మార్గదర్శక సూత్రాలను జారీ చేస్తూ ఈ సమావేశం ఒక డిక్లరేషన్‌న ఆమోదించింది. క్యూబా విప్లవానికి బేషరతుగా మద్దతునిస్తూ, మెజారిటీ ప్రజలు ఎంపిక చేసుకున్న సోషలిస్టు ప్రాజెక్టును నిర్మించుకునేందుకు వారికి గల హక్కును ప్రతినిధులు సమర్ధించారు. క్యూబా ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తూ, తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేసేందుకు ఉద్దేశించిన మీడియా దాడులను వారు తీవ్రంగా నిరసించారు. క్యూబాలో కొత్త సహకార ప్రాజెక్టులను అమలు చేసేందుకు అవసరమైన నిధులు సమకూర్చడం ద్వారా సంఘీభావాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు ఇంటర్నేషనల్ పీపుల్స్ అసెంబ్లీకి చెందిన రొడ్రిగొ సునే చెప్పారు. సమావేశాల చివరి రోజు పారిస్‌లో వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. క్యూబాకు సంఘీభావాన్ని పునరుద్ఘాటించారు. తమ వైఖరిని సమూలంగా మార్చుకోవాల్సిందిగా యురోపియన్ దేశాలను కోరారు.

అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టం

- ఫ్రాన్స్ సంస్థ నిర్ణయం

పారిస్ : మోసం, ముడుపుల ఆరోపణలతో అమెరికా న్యాయస్థానంలో ఛార్జిషీటును ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌లో కొత్తగా పెట్టుబడులు పెట్టబోమని ఫ్రెంచ్ చమురు, సహజ వాయువు కంపెనీ 'టోటల్ ఎనర్జీస్' ప్రకటించింది. అవినీతి ఏ రూపంలో జరిగినా దానిని అంగీకరించబోమని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కంపెనీ స్పష్టం చేసింది. అవినీతిపై విచారణ జరుగుతున్న విషయాన్ని అదానీ గ్రూప్ తనకు తెలియజేయలేదని చెప్పింది. 'అదానీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌లపై వచ్చిన ఆరోపణలు, వాటి పరిణామాలపై స్పష్టత వచ్చే వరకూ ఆ కంపెనీల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టబోము' అని టోటల్‌ఎనర్జీస్ తేల్చి చెప్పింది. అమెరికా ప్రాసిక్యూటర్లు న్యూయార్క్ కోర్టులో అదానీలపై ఛార్జిషీటు దాఖలు చేసిన కొద్ది రోజులకే ఫ్రాన్స్ కంపెనీ నుండి ఈ ప్రకటన వెలువడింది. ఆరోపణలకు సంబంధించి గౌతమ్ అదానీ, సాగర్ అదానీలపై న్యాయమూర్తి అరెస్ట్ వారంట్లు కూడా జారీ చేశారు.

అదానీ గ్రూపులోని అతి పెద్ద విదేశీ ఇన్వెస్టర్లలో టోటల్‌ఎనర్జీస్ ఒకటి. లిక్విఫైడ్ సహజ వాయువు వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ రెండు కంపెనీలు 2018లోనే ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జనవరిలో అదానీ గ్రీన్ ఎనర్జీలో టోటల్‌ఎనర్జీస్ 19.75 శాతం వాటాలు కొనుగోలు చేసింది. అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్‌లో 37.4 శాతం వాటాలను, అదానీ గ్రీన్ ఎనర్జీతో కుదుర్చుకున్న మూడు పునరుద్పాదక ఉమ్మడి భాగస్వామ్యాలలో 50 శాతం వాటాలను కూడా కలిగి ఉంది. ఆయా కంపెనీల్లో వాటాదారుగా తన ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలన్నీ తీసుకుంటానని టోటల్‌ఎనర్జీస్ తెలిపింది. కాగా టోటల్‌ఎనర్జీస్ ప్రకటన తర్వాత అదానీ గ్రీన్ ఎనర్జీ వాటాల విలువ 11.3 శాతం పడిపోయింది.

కెనడా, మెక్సికో, చైనాలపై భారీ సుంకాలకు ట్రంప్ యోచన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరి 20న పదవీ స్వీకార ప్రమాణం చేసిన వెంటనే అమెరికాకు చెందిన మూడు అతిపెద్ద వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, చైనాపై భారీ సుంకాలు విధించనున్నారు. న్యూయార్క్ టైమ్స్ వెల్లడించిన వివరాల ప్రకారం మెక్సికో, కెనడాల వస్తువులు, సేవలపై 25శాతం, చైనాపై అదనంగా మరో 10 శాతం సుంకాలు విధించేందుకు ట్రంప్ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కొత్త సుంకాల ప్రభావం ఆ మూడు పెద్ద దేశాలపైనే కాదు అమెరికాపై కూడా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల గ్లోబల్ సప్లయి చైన్ , కంపెనీలు దెబ్బ తింటాయని వారు పేర్కొన్నారు. మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై వెయ్యి శాతం సుంకం విధిస్తామని ట్రంప్ చెప్పారు.

వ్యవస్థలు సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల జీవితాలు మెరుగుపడేది

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధ
- ఘనంగా రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలు

న్యూఢిల్లీ : రాజ్యాంగ స్ఫూర్తితో కార్యనిర్వాహక వ్యవస్థ, చట్ట సభలు, న్యాయ వ్యవస్థ సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల జీవితాలు మెరుగుపడతాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో రాజ్యాంగ వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ దేశానికి మూలగ్రంథమైన రాజ్యాంగంలో ప్రతి పౌరుడి ప్రాథమిక విధులకు స్పష్టమైన నిర్వచనముందని, దేశ ఐక్యత, సమగ్రత, సామరస్యం, మహిళల గౌరవాన్ని రక్షించడానికి, ప్రోత్సహించడానికి ఇవి నిర్దేశించినట్లు ఆమె తెలిపారు. కార్యనిర్వాహక, చట్టసభ, న్యాయవ్యవస్థలతో పాటు ప్రజలంతా కూడా సక్రమంగా విధులను నిర్వర్తించినప్పుడే రాజ్యాంగ ఆదర్శాలు పరిపుష్టి అవుతాయని చెప్పారు. న్యాయవ్యవస్థను మరింత ప్రభావవంతంగా మార్చేందుకు సుప్రీంకోర్టు చేస్తున్న ప్రయత్నాలు హర్షనీయమన్నారు.

రాజ్యాంగ గౌరవం కాపాడేందుకు కృషి : మోడీ

రాజ్యాంగం గౌరవాన్ని కాపాడేందుకు తాము ప్రయత్నిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రధానన్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తదితరులు ప్రసంగించారు. ప్రధాని మోడీ మాట్లాడుతూ దేశంలో ఎమర్జెన్సీని చూశామని, ప్రజాస్వామ్యం ముందు తలెత్తిన ఇలాంటి ఎన్నో సవాళ్లను రాజ్యాంగం అధిగమించిందన్నారు. ఈ సందర్భంగా భారత న్యాయవ్యవస్థ వార్షిక నివేదిక 2023-24ను మోడీ విడుదల చేశారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ప్రసంగిస్తూ.. స్వాతంత్ర్యం తరువాత శక్తివంతమైన ప్రజాస్వామ్య, భౌగోళిక రాజకీయ నేతగా భారత్ ఉద్భవించిందని, ఈ పరివర్తనకు దేశ రాజ్యాంగం ఎంతో సహాయపడిందని తెలిపారు. దేశ విభజన, తీవ్రమైన నిరక్షరాస్యత, పేదరికం, ప్రజాస్వామ్యానికి పరీక్షలు వంటి పరిణామాల తర్వాత భారత్ స్వీయ-హామీ కలిగిన దేశంగా మారిందన్నారు. అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, ఎస్‌సిబిఎ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ తదితరులు ప్రసంగించారు.

సంభాల్ ఘటనకు బిజెపి ప్రభుత్వమే కారణం : బృందాకరత్

లక్నో: సంభాల్‌లో మసీదు సర్వే అనంతర ఘటనలకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వమే కారణమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ విమర్శించారు. సంభాల్ ఘటనలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ కుట్ర ఉందని,మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని యోగి ప్రభుత్వం విచ్ఛిన్నకర రాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. ఆదివారం సంభాల్‌లోని షాహి జామా మసీదులోకి పెద్ద యెత్తున పోలీసు బలగాలు ప్రవేశించాయని, దీనిని వ్యతిరేకించిన స్థానికులపై పోలీసులు కాల్పులు జరిపారని, ఈ కాల్పుల్లో మొత్తం అయిదుగురు వ్యక్తులు చనిపోయారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి హీరాలాల్ యాదవ్ చెప్పారు. మసీదు సర్వేకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో ఆయన పిటిషన్ కూడా వేశారు. దీనిపై సుప్రీం కోర్టు తక్షణమే జోక్యం చేసుకోవాలని బృందాకరత్ కోరారు. 1991లో ఆమోదివంచబడిన ప్రార్థనా స్థలాల చట్టం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని మత ప్రార్థనా స్థలాల విషయంలో యథాతథ స్థితి కొనసాగించాలని పేర్కొంటోంది. దీనికి భిన్నంగా దిగువ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని ఆమె కోరారు.. లేని పక్షంలో మతోన్మాద రాజకీయాలు చేసేవారు పదే పదే దిగువ కోర్టుకు వెళ్లి ఇటువంటి ఆదేశాలను తెచ్చుకుంటారు. ఈ ఆదేశాల్ని ఉపయోగించి మసీదులను లక్ష్యంగా చేసుకుంటారు. ఇది మత పరమైన హింసకు దారి తీస్తుందని సంభాల్ ఘటనే ఇందుకు నిదర్శనమని ఆమె అన్నారు.

సమాజ్‌వాది నేతలపై తప్పుడు కేసులు

సంభాల్‌లో మసీదు సర్వే సందర్భంగా ముగ్గురు ముస్లిం యువకులను అన్యాయంగా కాల్చి చంపిన పోలీసులు ఇప్పుడు బాధితులపైనే తప్పుడు కేసులను బనాయించారు. ఇటీవల కాల్చి చంపిన పోలీసులు ఇప్పుడు బాధితుల కుటుంబాలపై తప్పుడు కేసులు బనాయించారు. రాళ్ల దాడి ఘటన జరిగిన ఒక రోజు తర్వాత హింసాత్మక ప్రాంతంలో ఆర్‌ఎఎఫ్ సిబ్బందిని మోహరించారు. ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ, పార్టీ నేతలపై తప్పుడు కేసులు పెట్టడాన్ని వ్యతిరేకించారు.

ట్రంప్ రాగానే అదానీపై కేసు ఉపసంహరణ !

న్యూయార్క్ : అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తరువాత గౌతమ్ అదానీపై అవినీతి కేసును ఉపసంహరించుకునే అవకాశం ఉందని ప్రముఖ ఇండో అమెరికన్ అటార్నీ రవి బాత్రా వెల్లడించారు. ఈ కేసులో అదానీపై నమోదు చేసిన అభియోగాలు లోపభూయిష్టం అని దేశాధ్యక్షుడు భావిస్తే కేసును ఉపసంహరించుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అమెరికా ఫెడరల్ జిల్లాల్లో దేశ అధ్యక్షుడే ఒకొక్క స్టేట్ అటార్నీని నియమిస్తారు.

యుద్ధక్షేత్రంగా ఇస్లామాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ఒక పౌరుడు వున్నారు. ఆదివారం నుండి దేశ రాజధానిలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొనసాగుతున్న నిరసనలను అదుపులోకి తీసుకువచ్చేందుకు సెంట్రల్ ఇస్లామాబాద్‌లో వేలాదిమంది భద్రతా బలగాలను రంగంలోకి దింపారు. ఇప్పటివరకు నాలుగువేల మందికి పైగా మద్దతుదారులను అరెస్టు చేశారు. మొబైల్, ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేవారు. అశాంతిని అణచివేసేందుకు ర్యాలీలను నిషేధించారు. ప్రధాన మార్గాలను మూసివేశారు.

రాజధానిలోకి ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన షిప్పింగ్ కంటెయినర్ల వలయాన్ని ఛేదించుకుని మద్దతుదారులు మంగళవారం లోపలకు ప్రవేశించారు. కాల్పులు జరుపుతామని హెచ్చరికలు చేసినప్పటికీ వారు పట్టించుకోకుండా భద్రతా బలగాలతో ఘర్షణలకు దిగారు. ఫలితంగా హింస చెలరేగింది. ఏడాది కాలంగా జైల్లో వున్న ఇమ్రాన్ ఖాన్‌పై 150కి పైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇవన్నీకూడా రాజకీయ దురుద్దేశ్యాలతో మోపినవేనని ఆయన పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) విమర్శిస్తోంది. కేవలం న్యాయస్థానాలు మాత్రమే ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయగలవని అధికారులు పేర్కొంటున్నారు.

ఇస్లామాబాద్ రెడ్‌జోన్‌లో కీలకమైన ప్రభుత్వ భవనాలు వున్న డి చౌక్‌ను మంగళవారం సైన్యం తన అధీనంలోకి తీసుకుంది. ఆందోళనకారులు ఆయుధాలతో తలపడితే కాల్పులు జరపక తప్పదని హోం మంత్రి మోహ్‌సిన్ నక్వి హెచ్చరించారు. తమ నేత ఆదేశాల మేరకు తాము రోడ్లపైకి వచ్చామని, తర్వాత ఏం చేయాలనేది ఆయనే నిర్ణయిస్తారని ఆందోళనకారుడు షజార్ అలీ వ్యాఖ్యానించారు. కాగా అరాచకవాదుల గ్రూపు ఉద్దేశ్యపూర్వకంగానే శాంతి భద్రతల అధికారులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతోందని ప్రధాని షహబాజ్ షరీఫ్ విమర్శించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై భారీ నిరసన ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతు సంఘాల ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రైతు సంఘం నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిపార్సులను అమలు చేయాలని, కమిషన్ సిఫార్సు చేసిన విధంగా పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, నాయకులు జి.కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు.

అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని సిఎం, ప్రధాని, రాష్ట్రపతిలకు పంపేందుకు హెచ్చరిక నోటీసులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, ఆర్.వి నర్సింహారావు, కెఆర్‌కె మూర్తి, కె.సుభాషిణి, ఎ.వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరామ్మ, రైతు సంఘం నాయకులు కె.వి.వి ప్రసాద్, ఎఐటియుసి నాయకులు సాంబశివరావు, సుధీర్, టియుసిఐ రాష్ట్ర నాయకులు పోలవరపు కృష్ణ, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, పి.పోలారి, రామకృష్ణ, ఎఐసిసిటియు నాయకులు ఈశ్వర్, నల్లమడ రైతు సంఘం నాయలకు కొల్లా రాజమోహన్, డి.హరినాధ్, మహిళా సంఘం నాయకురాలు పద్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.





మీకోసం


కమల, నిమ్మ తొక్కలని చిన్న చిన్న ముక్కలుగా చేసి ఎండబెట్టి పొడి చేసి సర్ఫ్‌లో కానీ, సున్నిపిండిలో కాని వేస్తే చక్కటి సువాసనతోపాటుగా మురికి కూడా వదులుతుంది.

జీవన సౌరభం

మెట్టు చూస్తూ ఉంటే మేడ ఎక్కలేం. ప్రణాళికలు వేస్తూ ఉంటే విజయం సాధించలేం. ఆచరణతోనే ఏదైనా సాధ్యం.

JEEVANA
జీవన the family

చిట్టి చిలకలు




చిట్టి చిట్టి చిలకలున్న
చెట్టుకు కాసెను పువ్వులంట
పువ్వులాయెను కాయలంట
కాయలేమో పండ్లాయనంట
పండ్లేమో మాకిష్టమంట
మేమే ఆ చిలకలమంట

పుష్టిగ మేమే తింటాం
ఆటలు హాయిగా ఆడుతాం
పాటలు బాగా పాడుతాం
చక్కగా బడికి పోతాం
చదువులు బాగా చదువుతాం

పరీక్షల భయం రానీయం
ఇష్టంగా చదువు నేర్చుకుంటాం
విజయాన్ని సాధిస్తాం

–యజ్ఞశ్రీ మాలేపాటి




లెక్క తేల్చండి

ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 68

నేను గీసిన బొమ్మ





గౌరవ్ శ్యామ్ సుఖ
9వ తరగతి,
అరవింద హైస్కూలు సిబిఎస్ఇ
కుంచనపల్లి, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆస్తమాపై అప్రమత్తత అవసరం

ఏటేటా శీతాకాలంలో చల్లటి వాతావరణం, ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయికి తగ్గిపోతుండటం తెలిసిందే. ఈ కాలంలో సామాన్యంగా ప్రతిఒక్కరిలో రోగ నిరోధక శక్తి మరింత పడిపోయి ఆస్తమా తీవ్రరూపం దాల్చుతుంది. ఇలాంటి సమయంలోనే ప్రతిఒక్కరిలోనూ తమలో ఉన్న అనారోగ్య సమస్యలు ఒక్కొక్కటిగా కూడా బయటకు వస్తుంటాయి. గాలి, నీటిలో క్రిమికీటకాల వ్యాప్తి ద్వారా కూడా వ్యాధులు వ్యాపిస్తుండటం సర్వ సాధారణంగా జరిగేదే. అయితే దగ్గు, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు చలికాలంలో అతిత్వరగా వ్యాప్తి చెందుతాయి. సైనస్ వంటి సమస్యలు ఉన్న వారు ఈ కాలంలో అత్యంత జాగ్రత్తగా మెలగటం ఉత్తమం. కీళ్ల నొప్పులు, చర్మవ్యాధుల సమస్యలు కూడా మామూలుగా ఉన్నవి తీవ్రంగా మారుతుంటాయి. పైన పేర్కొన్న అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వ్యాధి ముదరకముందే నిపుణులైన వైద్యుల సలహాలు తీసుకుంటే తద్వారా వాటిని సకాలంలో నియంత్రించటానికి అవకాశం ఉంటుంది. తీవ్రత పెరిగితే నియంత్రణకు కొంత సమయం పడుతుంది.

పిల్లల నుంచి పెద్దల వరకూ...

ఆస్తమా వ్యాధి చిన్న పిల్లల నుంచి పెద్ద వారిలో వచ్చే శ్వాస సంబంధితమైన వ్యాధి. ప్రధానంగా ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాల సమస్య. దీనికి మూలం అలర్జీ. మనం ముక్కుతో పీల్చుకునే గాలి శ్వాసనాళం ద్వారా ఊపిరితిత్తుల లోపలికి చేరుకుంటుంది. ఈ శ్వాసనాళం పై నుంచి రెండుగా చీలుతూ వచ్చి మళ్లీ చిన్న చిన్న గొట్టాలుగా విడిపోతూ..అతి సూక్ష్మమైన గాలి గదుల్లోకి చేరవేస్తుంది. సాధారణంగా దుమ్ము, ధూళి ఉన్న ప్రాంతాలకు వెళ్లినప్పుడు దగ్గు వస్తుంది. ఇది హాని కారకాలు లోపలికి ప్రవేశించకుండా, వాటిని బయటకు నెట్టేయడానికి శరీరం చేసే ప్రయత్నమే. అయితే ఆస్తమా వచ్చే స్వభావం (అటోపీ) గల వారికి ఇలాంటి మామూలు విషయాలే పెద్ద సమస్యగా మారతాయి. దుమ్ము, ధూళి, పుప్పొడి, రసాయనాలు వంటివి తగిలినప్పుడు లోపల అలర్జీ ప్రేరేపితమై గాలిగొట్టాలు విపరీతంగా స్పందిస్తుంటాయి. అస్తమాకు మూలం ఇదే. గాలిగొట్టాలకు అలర్జీ కారకాలు తగిలినప్పుడు రోగనిరోధక కణాలు అతిగా స్పందిస్తాయి. దీంతో వాపు ప్రక్రియ (ఇన్ఫ్లమేషన్)మొదలవుతుంది. అప్పుడు గాలిగొట్టాల గోడలు ఉబ్బి, లోపలికి మార్గం సన్నబడుతుంది. గాలిగొట్టాల్లో జిగురుద్రవం ఉత్పత్తి పెరుగుతుంది. ఇది లోపలే చిక్కుకుపోతుంది. చుట్టుపక్కలా వాపు మాదిరి మార్పులు మొదలవుతాయి. దీంతో శ్వాసతీసుకోవటం, వదలటం కష్టమైపోతుంది. ఫలితంగా దగ్గు, పిల్లికూతలు, ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అవటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి.

ఆయుర్వేద వైద్య విధానంలో ప్రకృతి పరంగా లభించే సంప్రదాయ వనమూలికల ద్వారా వివిధ రోగాలను సులభంగా నయంచేయొచ్చు. చలికాలంలో వచ్చే ఆస్తమా లేదా ఉబ్బసం వ్యాధిని నయం చేసే వైద్య పద్ధతులు ఆయుర్వేద వైద్య విధానంలో ఉన్నాయి. ఆస్తమా సోకిన వారు భయపడకుండా సులభంగా డాక్టరు సూచించే ఆయుర్వేద తైలాలు, మూలికలు, మిశ్రమాలు, మందులను వాడటం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆస్తమా బాధితులతో పోలిస్తే మనదేశంలో 13 శాతం మంది బాధపడుతున్నారు. మరణాల్లో 42 శాతం మనదగ్గరే సంభవిస్తున్నాయి.




–డాక్టర్ కూరపాటి శ్రీనివాస్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ ఆయుర్వేద వైద్యకళాశాల,
విజయవాడ



రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది

ఆస్తమా ఉన్న వారిలో ఆయాసం, దగ్గు బాగా ఇబ్బంది పెడతాయి. శీతాకాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల విటమిన్–డి తగ్గిపోతుంది. తద్వారా రోగ నిరోధక శక్తి పడిపోయి ఆస్తమా తీవ్ర రూపం దాల్చుతుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి 30 నుంచి 35 సంవత్సరాల పెద్దవారిలో కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. పిల్లల్లో వస్తే దానిని చైల్డ్ హుడ్ ఆన్సెట్ ఆస్తమా అని, పెద్దల్లో అయితే అడల్ట్ ఆన్సెట్ ఆస్తమాగా పిలుస్తుంటారు. న్యూమోనియా, జలుబు వంటివి కూడా ఎక్కువగా పీడిస్తుంటాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు తగ్గకుండా ముదిరితే ఆస్తమాకు దారితీస్తుంటుంది.



ఆయుర్వేదంలో ఇలా తగ్గించుకోవచ్చు

హెర్బల్ టీ : వాము, తులసి, మిరియాలు, అల్లం ఉపయోగించి కొన్ని హెర్బల్ టీలను తయారుచేసుకోవచ్చు. ఆస్తమా వ్యాధి నివారణకు ఇది దోహదపడుతుంది.

వాసక : ఇది ఒక శక్తివంతమైన భారతీయ మూలిక. ఇది ఉబ్బసం, బ్రోన్కైటిస్, అధిక శ్లేష్మ స్రావానికి చికిత్స చేస్తుంది. ఒక టీస్పూన్ వాసక రసాన్ని, రెండు టీ స్పూన్ల తేనెతో కలిపి రోజుకు రెండుసార్లు తీసుకోవచ్చు.

యష్టిమధు : యష్టిమధు అనేక ఆరోగ్య ప్రయోజనాలకు కల్గివుంది. ఉబ్బసం లక్షణాలకు ఉపశమనం చేస్తుంది. ఒక కప్పు యష్టిమధు టీ రోజుకు మూడు సార్లు తీసుకుంటే ఉబ్బసం సమస్యలు తగ్గుతాయి.

మిరియాలు, తేనే మిశ్రమం : ఆస్తమాతో ఇబ్బంది పడుతుంటే వెంటనే మిరియాలు, తేనె, ఉల్లిపాయరసం మిశ్రమాన్ని తీసుకోవాలి. ఇంకా ఎక్కువ ఇబ్బంది పడుతుంటే వెల్లుల్లి రెబ్బల రసాన్ని వేడి నీటిలో కలిపి తాగించటం మంచిది. ఈ మిశ్రమాన్ని భవిష్యత్తు అవసరాల కోసం కూడా సిద్ధం చేసుకుని ఉంచొచ్చు. వేడి నీటి కాపడం ద్వారా కూడా ఛాతీ కండరాలు వదులవుతాయి. సాధారణ శ్వాసను పునరుద్ధరించటంలో సహాయపడుతుంది.

మంచి ఆహారం, జీవన శైలి ముఖ్యం : ఆస్తమా ఉన్న రోగులకు మంచి ఆహారాన్ని అందించాలి. ఒత్తిడిలేని జీవితాన్ని గడపాలి. పేలవమైన జీర్ణక్రియ మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. అదనపు టాక్సిన్స్ నిర్మించబడతాయి. రోజంతా పుష్కలంగా నీటిని తాగటం వల్ల శ్లేష్మస్రావాలు, సన్నగా, వదులుగా ఉంటాయి. తద్వారా అవి వాయు మార్గాలను అడ్డుకోకుండా ఉంటాయి.

రెగ్యులర్ థెరపీ : క్రమం తప్పకుండా ఆందోళన, ఒత్తిడిని ఎదుర్కొనే వారికి థెరపీ సెషన్లు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఉబ్బసం ఉన్న వారికి శారీరక, మానసిక ఒత్తిడి తగ్గటానికి అవగాహన కల్పిస్తారు.

వ్యాయామం చేయాలి : ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయి. ఉబ్బసం ఉన్న వారికి ఈత చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

ఇవి చేయాలి

ఆహారం : తేలికగా అరిగే వేడిగా ఉండే ఆహార పదార్థాలను తినాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. తేనె, వెల్లుల్లి, పసుపు, మిరియాలు, అల్లం, పుదీనా, ఉసిరి వంటివి తరచుగా తీసుకుంటూ ఉండాలి. పాతబియ్యం, పెసలు, ఉలవలు, పొట్లకాయ వంటివి ఆహారంలో భాగమయ్యేలా చూసుకోవాలి. చలిలో బయటకు వెళ్లినప్పుడు చెవిలో దూది పెట్టుకోవాలి. పసుపు వేసిన వేడి నీటితో ఆవిరి పట్టాలి. అను తైలం లేక ఆవు నెయ్యిని రెండు చుక్కలు చొప్పున రెండు ముక్కు రంధ్రాల్లో వేయాలి.

చేయకూడనివి

- నిల్వ ఉన్న ఆహారపదార్థాలు తినరాదు
- చల్లటి పదార్థాలు, పానీయాలు సేవించొద్దు
- పెరుగు, అరటిపండు, బెండకాయ, కొబ్బరి, బంగాళదుంప, మైదా పిండి, శనగ పిండి, వేరుశెనగగుళ్లు, చేపలు, మినుములు, తీపి పదార్థాలకు దూరంగా ఉండటం మేలు

రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడం కోసం...

- అగస్త్య హరితకీ రసాయనం, చ్యవన ప్రాశ రసాయనం
- కుష్మాండ రసాయనం, దగ్గు ఉన్నప్పుడు హరిద్రాఖాండా, తాళిసాధి చూర్ణం, మొదలైనవి తీసుకోవాలి. శీతోపలాది చూర్ణం, సీతాఫలాల చూర్ణం మొదలైనవి వ్యాధి తీవ్రను తగ్గించటానికి దోహదపడతాయి.

మోడీ ప్రజావ్యతిరేక విధానాలపై

కార్మిక, కర్షకలోకం కన్నెర్ర

- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులు అమలుకు డిమాండ్



కర్నూలులో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి – యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక, కర్షక లోకం కన్నెర్ర చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, కలెక్టరేట్ల వద్ద మహా ధర్నాలు చేపట్టారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని నినాదాలు చేశారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా ప్రధాని ఇచ్చిన లిఖిత పూర్వక హామీలను అమలు చేయాలని, లేకపోతే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

తిరుపతి కలెక్టరేట్ వద్ద ఓ వైపు బియ్యం, పప్పులు, కూరగాయలు, గ్యాస్ తదితర నిత్యావసరాలు, మరోవైపు 500 రూపాయల నోట్ల కట్టలు పెట్టి తూకంతో నిరసన తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. ముడుపులు ఇచ్చి విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకున్న అదానీని తక్షణమే అరెస్టు చేయాలని, ఈ కుంభకోణంపై సిబిఐ, ఇడి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అదానీ చేసుకున్న ఒప్పందాలను టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కార్పొరేట్ కంపెనీలకు ఈ ప్రభుత్వాలు దాసోహమయ్యాయని విమర్శించారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు.

కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ.. ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అమలాపురంలో జరిగిన ధర్నాలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తూ కార్మికులు, రైతులను విస్మరిస్తున్నాయన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిరసన ప్రదర్శన, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించారు.

కర్నూలులో జిల్లా పరిషత్ నుంచి రాజ్‌విహార్ కూడలి, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన చేపట్టి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ మాట్లా డుతూ... ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతుల ఆందోళన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. నంద్యాలలో నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి పద్మావతి నగర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు.

గుంటూరులో బిఆర్ స్టేడియం నుంచి మార్కెట్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వి. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరగాలంటే మద్దతు ధరల చట్టం తేవాలని, కేరళ తరహాలో రైతులకు, వ్యవసాయ కార్మికులకు శాశ్వత రుణమాఫీ చేయాలన్నారు.

ఏలూరులో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎస్.రామ్మోహన్, ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, అఖిల భారత ప్రగతిశీల రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.గౌస్, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య తదితరులు పాల్గొన్నారు. భీమవరంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖలోని దొండపర్తి రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనకాపల్లిలో సిఐటియు కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ మర్రాపు సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఐటిడిఎ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ప్రదర్శన నిర్వహించి అక్కడ నిరసన చేపట్టారు. రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, రైతు కూలీ సంఘం (ఎపి) రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ మాట్లాడారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి అనుసరిస్తోందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ అనంతరం ధర్నా నిర్వహించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు పి.ఝాన్సీ పాల్గొన్నారు. సాలూరులో మంత్రి సంధ్యారాణికి వినతిపత్రాన్ని అందజేశారు.

శ్రీకాకుళంలో స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి ప్రకాష్ , సిఐటియు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు పి తేజేశ్వరరావు, కె స్రవంతి తదితరులు పాల్గొన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు మేలు చేకూరుస్తోందని విమర్శించారు.

అనంతపురంలో లలిత కళాపరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా కొనసాగుతుండగా కార్యాలయం లోపలోకి వెళ్తున్న కలెక్టర్ కారును కార్మికులు, రైతు సంఘ నాయకులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని పక్కకు తోసేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి రైతు, కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా ఆర్‌టిసి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. నెల్లూరులో గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన, కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని బస్టాండ్ సెంటర్ నుండి కోనేరు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కడప ఆర్‌డిఒ కార్యాల యం, అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి సంఘీభావం తెలియజేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద, బాపట్లలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

సన్‌రైజర్స్ వ్యూహం ఫలించేనా..?

- 2025 వేలంలో ఆటగాళ్ల కొనుగోలుతో ప్రణాళిక అమలు



జెడ్డా: సౌదీ అరేబియాలోని జెడ్డాలో జరిగిన ఐపిఎల్–2025 సీజన్ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్యం పక్కా ప్రణాళికతో వ్యవహరించిందని మాజీ క్రికెటర్లు విశ్లేషిస్తున్నారు. వేలం ఉన్న 577మంది ఆటగాళ్లలో హైదరాబాద్ జట్టు తొలి ప్రాధాన్యత క్రమంలోనే మహ్మద్ సిరాజ్, ఇషాన్ కిషన్‌లను కొనుగోలు చేసి తన వ్యూహమేమిటో మిగిలిన ఫ్రాంచైజీలకు తెలిపిందని వారు అభిప్రాయపడుతున్నారు. రూ.45కోట్లతో వేలం బరిలో దిగిన ఎస్‌ఆర్‌హెచ్ 15మంది ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు ఆ మొత్తాన్ని వెచ్చింది. వీరిద్దరినీ తొలిరోజు వేలంలో కొనుగోలు చేయగా.. రెండోరోజు బ్యాక్ అప్ బెంచ్‌ను పటిష్ఠం చేసుకొనే దానిపైనే ప్రధానంగా దృష్టి సారించింది. ఎస్‌ఆర్‌హెచ్ జట్టు వేలంకు ముందే పాట్ కమిన్స్(రూ.18కోట్లు)), అభిషేక్ శర్మ(రూ.14కోట్లు), నితీశ్‌రెడ్డి(రూ.6కోట్లు), క్లాసెన్(రూ.23కోట్లు), ట్రివస్ హెడ్(రూ.14కోట్లు) లను అంటిపెట్టుకొని మంచి పని చేసిందని, ఆ తర్వాత రెండ్రోజులపాటు జరిగిన వేలంలో 15మంది ఆటగాళ్లను కొనుగోలు చేసి పక్కా ప్రణాళికతో ఈసారి టైటిల్ వేటకు సిద్ధమౌతుందని వారు వారు అంటున్నారు. ముఖ్యంగా ప్లేయింగ్ ఎలెవెన్‌పైనే సన్‌రైజర్స్ దృష్టి సారించినట్లు తెలుస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. సన్‌రైజర్స్‌వద్ద ఇంకా రూ.20లక్షల మాత్రమే నగదు మిగిలి ఉండగా.. ఆర్‌టిఎం కార్డ్‌ను ఈసారి ఫ్రాంచైజీ వినియోగించలేదు. ఇంకా ఐదుగురు ఆటగాళ్లను కొనుగోలు చేసుకొనేందుకు అవకాశముండగా.. ఇందులో ఒక విదేశీ ప్లేయర్‌ను కూడా కొనుగోలు చేసుకోవాల్సి ఉంది. కానీ పర్సు ఖాళీ అవ్వడంతో 20మంది ఆటగాళ్లతోనే 2025 ఐపిఎల్ సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ బరిలోకి దిగుతోంది.

2025 వేలంలో సన్‌రైజర్స్ కొనుగోలు చేసిన ఆటగాళ్లు..

1. ఇషాన్ కిషన్	రూ.11.25కోట్లు
2. షమీ	రూ.10కోట్లు
3. హర్షల్ పటేల్	రూ.8కోట్లు
4. రాహుల్ చాహర్	రూ.3.20కోట్లు
5. అభినవ్ మనోహర్	రూ.3.20కోట్లు
6. ఆడం జంపా	రూ.2.40కోట్లు
7. సిమ్రన్‌జిత్ సింగ్	రూ.1.50కోట్లు
8. ఈషన్ మలింగ	రూ.1.20కోట్లు
9. జయదేవ్ ఉనాద్కట్	రూ.1కోటి
10. బ్రైడెన్ కర్సే	రూ.1.కోటి
11. కమిందు మెండీస్	రూ.75లక్షలు
12. జీషన్ అన్సారీ	రూ.40లక్షలు
13. అథర్వ తైడే	రూ.30లక్షలు
14. అంకిత్ వర్మ	రూ.30లక్షలు
15. సచిన్ బేబీ	రూ.30లక్షలు

వచ్చే సీజన్‌కు సన్‌రైజర్స్ ఆటగాళ్ల జాబితా..

బ్యాటర్లు: హెడ్, అభిషేక్ శర్మ, అథర్వ తైడే, అభినవ్ మనోహర్, అంకిత్ వర్మ
వికెట్ కీపర్లు: ఇషాన్ కిషన్, హెన్రిక్ క్లాసెన్
ఆల్‌రౌండర్లు: సచిన్ బేబీ, ఈషన్ మలింగ, అంకిత్ వర్మ, పాట్ కమిన్స్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్, కమిందు మెండీస్, బ్రైన్ కర్సే
పేసర్లు: జయదేవ్ ఉనాద్కట్, సిమ్రన్‌జిత్ సింగ్
స్పిన్నర్లు: రాహుల్ చాహర్, జీషన్ అన్సారి, ఆడం జంపా.

జట్టు అంచనా:
హెడ్, అభిషేక్, ఇషాన్, నితీశ్, క్లాసెన్, సచిన్, అభినవ్, కమిన్స్, షమీ, హర్షల్, చాహర్.

గుకేశ్-డింగ్ రెండో గేమ్ డ్రా

- ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్



సింగపూర్: భారత స్టార్ గ్రాండ్ మాస్టర్ డి. గుకేశ్, డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్(చైనా) మధ్య మంగళవారం జరిగిన రెండో గేమ్ డ్రా అయ్యింది. ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌కోసం వీరు పోటీ పడుతున్నారు. సోమవారం జరిగిన తొలిరౌండ్ లో డి. గుకేశ్ తెల్లపావులతో ఆడి ఓటమిపాల య్యాడు. మంగళవారం జరిగిన రెండోరౌండ్‌లో నల్లపావులతో ఆడిన గుకేశ్.. డింగ్ లిరెన్‌ను నిలువరించాడు. డింగ్ ఇ4తో ప్రారంభించగా.. గుకేశ్ ఇ5తో సమాధానమిచ్చాడు. 23ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించారు. దీంతో ఇరువురికి చెరో అరపాయింట్ దక్కింది. రెండోరౌండ్ ముగిసేసరికి డింగ్ 1.5పాయిం ట్లు, డి. గుకేశ్ 0.5పాయింట్‌తో ఉన్నాడు.

ఆయూబ్ సెంచరీ

- రెండో వన్డేలో జింబాబ్వేపై పాకిస్తాన్ ఘన విజయం

బులవాయో(జింబాబ్వే): జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్ జట్టు ఘన విజయం సాధించింది. జింబాబ్వే నిర్దేశించిన 146పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ ఓపెనర్ సైబ్ ఆయూబ్(113), షఫీక్(32) వికెట్ చేజార్చుకోకుండా మ్యాచ్‌ను ముగించారు. అంతకుముందు పాకిస్తాన్ పేసర్లు అబ్రార్ అహ్మద్(4/33), అఘా సల్మాన్(3/26) రాణించడంతో జింబాబ్వే జట్టు 32.3ఓవర్లలో 145పరుగులకే ఆలౌటైంది. జింబాబ్వే జట్టులో మయర్స్(33), విలియమ్స్(31), సికిందర్ రాజా(17), బెన్నెట్(14) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆ లక్ష్యాన్ని పాకిస్తాన్ జట్టు 18.2ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆయుబ్‌కు లభించగా.. మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు 1–1తో సమంగా నిలిచాయి. మూడో, చివరి వన్డే గురువారం జరగనుంది.

29న ఐసిసి సమావేశం

- ఛాంపియన్స్, డబ్ల్యుటిసి టైటిళ్లపైనే ప్రధాన చర్చ?

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) అత్యవసర సమావేశం 29న జరగనుంది. ఈ సమావేశంలో ఛాంపియన్స్ ట్రోఫీ, డబ్ల్యుటిసి టైటిళ్లపై ప్రధానంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది పాకిస్తాన్‌లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారతజట్టు అంగీకరించడం లేదు. హైబ్రీడ్ మోడల్‌కు బిసిసిఐ ప్రతిపాదిస్తుండగా.. అందుకు పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు ససేమిరా అంటోంది. 2016, 2023లలో భారత్‌లో జరిగిన ఐసిసి టోర్నీల్లో పాకిస్తాన్ జట్టు భారత పర్యటనకు రాగా.. 2006నుంచి భారతజట్టు పాకిస్తాన్‌లో ఐసిసి టోర్నీలో ఆడేందుకు వెళ్లడం లేదు. ఇదే విషయాన్ని పాక్ బోర్డు ఐసిసి సమావేశంలో ప్రధాన ఎజెండాగా తీసుకురావాలని చూస్తోంది. ఐసిసి టోర్నీల షెడ్యూల్‌ను 100ముందు ప్రకటించాల్సి ఉన్న దృష్ట్యా ఐసిసి అత్యవసరంగా సమావేశం కానుంది. అలాగే ఈ వారంలో ఐసిసి ఛైర్మన్‌గా జే షా కూడా బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో ప్రస్తుత సభ్యులతో సమావేశంలో వేయాలని ఐసిసి భావించినట్లు తెలిసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68